www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -196 సోమవారం 2 నవంబర్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

రాప్తాడు ఉన్మాదిపై పోలీసు కాల్పులు

విద్యార్థినిని రంపంతో కోసిన నిందితుడు ఆస్పత్రిపాలు

అత్తకూరు అటవీ ప్రాంతంలో నక్కిన వైనం.. పట్టుకోడానికి వెళ్లిన పోలీసులపై దాడి.. సీఐని కత్తితో పొడిచి పారిపోయే యత్నం

6 రౌండ్లు కాల్పులు జరిపి పట్టుకున్న పోలీసులు

కాళ్లలోకి దూసుకెళ్లిన తూటాలు.. బాణసంచా కాల్చి ప్రజల సంబరాలు



అనంతపురం క్రైం,నవంబర్ 01,(ప్రజావినికిడి):

ఎలక్ట్రిక్ రంపంతో విద్యార్థినిపై పాశవిక దాడిచేసిన ఉన్మాదికి, 24 గంటల్లోపే పోలీసులు బేడీలు వేశారు. తరగతి గదిలోకి వెళ్లి, అందరి ముందే దారుణానికి పాల్పడ్డ అతడు, తనను పట్టుకోవడానికి వచ్చిన పోలీసులపైనా దాడికి ప్రయత్నించాడు. దీంతో.. కాళ్లపై కాల్చి ఆ ఉన్మాదిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 'అమ్మాయిలపై చెయ్యి పడితే ఖబడ్దార్' అనే రాష్ట్ర ప్రభుత్వ హెచ్చరికను ఆచరణలో అమలుచేసి చూపారు. విషయం తెలియగానే ప్రజలు వీధుల్లోకి వచ్చి బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకొన్నారు. అనంతపురం జిల్లా రాప్తాడు జడ్పీ ఉన్నతపాఠశాలలో పదో తరగతి విద్యార్థినులపై విచక్షణారహితంగా హేమంత్ దాడి చేసి పరారైన విషయం తెలిసిందే. **మిగతా 2లో...**

జ్ఞానేశ్ జైలుకే


ఇ+ తర్వాత మీ వంతే మోదీజీ'..

ఢిల్లీ సభలో రాహుల్ గాంధీ హెచ్చరిక!

ఢిల్లీ (ప్రజావినికిడి):

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయనను పదవి నుంచి తొలగించి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. ఆ తర్వాత తమ పోరాటం ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై ఉంటుందని పేర్కొన్నారు. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఇండియా కూటమి నిర్వహించిన**మిగతా 2లో...**





కేంద్ర ఖజానాకు కాసుల వర్షం..

23 శాతం పెరిగిన జీఎస్టీ వసూళ్లు

అక్టోబర్‌లో స్థూల జీఎస్టీ వసూళ్లు రూ.2.31 లక్షల కోట్లు

గతేడాదితో పోలిస్తే వసూళ్లలో 22.9 శాతం వృద్ధి

రిఫండ్ల తర్వాత నికర ఆదాయం రూ.2.03 లక్షల కోట్లు

దేశీయ జీఎస్టీ వసూళ్లు రూ.1.59 లక్షల కోట్లకు చేరిక

బిగుమతులపై పన్ను ఆదాయం 42.2 శాతం పెరుగుదల



2లో.

నేడే అమిత్ షా పాదయాత్ర

ఏర్పాట్లను పరిశీలించిన కిషన్‌రెడ్డి, రాంచందర్‌రావు

రాహుల్ గాంధీకి నాయకత్వ లక్షణాలు లేవు: ఈటల



2లో.

పురపోరు ప్రశాంతం!

అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్సుల్లో!

ఏపీలో 92 పట్టణ స్థానిక సంస్థలకు పోలింగ్

సాయంత్రం 5 గంటలకు ముగిసిన పోలింగ్.. క్యూలో ఉన్నవారికి అవకాశం

నగరాల్లో తక్కువ, చిన్న పట్టణాల్లో అధిక పోలింగ్ శాతం నమోదు

మధ్యాహ్నం 3 గంటల సమయానికి రాష్ట్ర సగటు 48.03 శాతంగా వెల్లడి

నవంబర్ 3న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి




అమరావతినవంబర్ 01,(ప్రజావినికిడి):

ఆంధ్రప్రదేశ్‌లో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న పట్టణ స్థానిక సంస్థల (మున్సిపల్) ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ఆదివారం సాయంత్రం 5 గంటలకు ముగిసింది. చెదురుమదురు ఘటనలు మినహా రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా జరగడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. మొత్తం 92 పట్టణ స్థానిక సంస్థల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమైంది. నవంబర్ 3వ తేదీన ఓట్ల లెక్కింపు జరిపి, ఫలితాలను వెల్లడించనున్నారు.

రాష్ట్రంలోని 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 79 మున్సిపాలిటీలు/నగర పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. ఇప్పటికే 8 చోట్ల చైర్‌పర్సన్‌తో పాటు వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. మిగిలిన స్థానాలకు ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్, సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. నిర్దేశిత సమయానికి పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్లలో నిల్చున్న ఓటర్లందరి **మిగతా 2లో...**

నివేదికల తర్వాతే రీపోలింగ్‌పై నిర్ణయం: ఎస్ఈసీ పునేఠా



పల్నాడు, అనంతపురం జిల్లాల్లో కొన్ని ఘటనలు జరిగాయని వెల్లడి

విజయవాడలో పోలింగ్ ఆలస్యం కావడంతో సమయం పొడిగింపు

అధికారుల నుంచి నివేదికలు వస్తేనే చర్యలుంటాయని స్పష్టం చేసిన

పునేఠారాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల పోలింగ్ స్వల్ప ఘటనలు

మినహా చాలావరకు ప్రశాంతంగా ముగిసిందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ కుమార్ పునేఠా వెల్లడించారు. పల్నాడు, అనంతపురం జిల్లాల్లో కొన్ని హింసాత్మక ఘటనలు జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందని, వాటిపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీల నుంచి నివేదికలు అందిన తర్వాత రీపోలింగ్‌పై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఏపీ తీరం వైపు దూసుకొస్తున్న

మురసు తుఫాను

విద్యుత్ వ్యవస్థలు తీవ్రంగా దెబ్బతింటాయని అంచనా

పునరుద్ధరణకు తమిళనాడు సాయం కోరిన చంద్రబాబు

సిబ్బందిని, యంత్రాలను పంపుతామని హామీ ఇచ్చిన తమిళనాడు సీఎం

ఇప్పటికే ఏపీలో పనిచేస్తున్న తెలంగాణ విద్యుత్ సిబ్బంది

కర్ణాటక సహకారం కూడా తీసుకోవాలని యోచిస్తున్న ఏపీ ప్రభుత్వం



అమరావతినవంబర్ 01,(ప్రజావినికిడి):

ఆంధ్రప్రదేశ్‌పై 'మురసు' తుపాను ప్రభావం చూపే అవకాశం ఉందన్న హెచ్చరికల నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ముందస్తు చర్యలను వేగవంతం చేశారు. ఇందులో భాగంగా పొరుగు రాష్ట్రాల సహకారం కోరుతూ ఆయన ఆదివారం తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌కు ఫోన్ చేశారు. తుపాను కారణంగా రాష్ట్రంలో విద్యుత్ వ్యవస్థకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని, పునరుద్ధరణ పనుల కోసం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. **మిగతా 2లో...**

రీపోలింగ్ జరిపితేనే ఓటు వేస్తా

పులివెందులలో ఓటు వేయకుండానే వెనుదిరిగిన జగన్..

పులివెందుల మున్సిపల్ ఎన్నికల్లో ఉద్రిక్తతలు

తాను ఓటు వేస్తే అంతా సజావుగా సాగుతోందనుకుంటారని వెల్లడి

రీపోలింగ్ జరిపితేనే ఓటు వేస్తానని స్పష్టీకరణ

ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని వ్యాఖ్యలు

2లో.



విద్యార్థుల భద్రతే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత

బెంగళూరు ఆసుపత్రిలో రాప్తాడు బాధితురాలిని పరామర్శించిన మంత్రి లోకేశ్

పాఠశాలల్లో మొదటి పీరియడ్ తర్వాత గేట్లు మూసివేయాలని నిర్ణయం

బాలికను సొంత కూతురిలా చూసుకుంటామని కుటుంబానికి భరోసా

నిందితుడిపై కఠిన చర్యలు తప్పవని, ఉపేక్షించేది లేదని వెల్లడి

బెంగళూరు నవంబర్ 01, (ప్రజావినికిడి):

రాష్ట్రంలోని పాఠశాలల్లో విద్యార్థుల భద్రతను పటిష్ఠం చేసే దిశగా ఏపీ విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇకపై ప్రతి పాఠశాలలో మొదటి పీరియడ్ ప్రారంభమైన వెంటనే తప్పనిసరిగా గేట్లను మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతపురం జిల్లా రాప్తాడులో ఓ పాఠశాలలోకి చొరబడిన **మిగతా 2లో...**



ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

కేంద్ర ఖజానాకు కాసుల వర్షం..

దేశంలో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు భారీగా పెరిగాయి. గతేడాది ఇదే నెలతో పోలిస్తే అక్టోబర్‌లో 22.9 శాతం వృద్ధి నమోదైంది. మొత్తం వసూళ్లు రూ.2.31 లక్షల కోట్లకు చేరాయి. దేశీయ ఆర్థిక కార్యకలాపాలు పుంజుకోవడంతో పాటు దిగుమతులపై పన్ను ఆదాయం పెరగడం ఇందుకు దోహదం చేసింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఆదివారం విడుదల చేసిన గణాంకాలు వెల్లడించాయి.గతేడాది అక్టోబర్‌లో స్థూల జీఎస్టీ వసూళ్లు రూ.1.88 లక్షల కోట్లు కాగా, ఈ ఏడాది రూ.2.31 లక్షల కోట్లకు చేరాయి. రిఫండ్లు మినహాయించగా నికర ఆదాయం 25.6 శాతం పెరిగి రూ.2.03 లక్షల కోట్లుగా నమోదైంది. గతేడాది ఇదే నెలలో ఇది రూ.1.61 లక్షల కోట్లుగా ఉంది.దేశీయ లావాదేవీల ద్వారా వచ్చిన జీఎస్టీ ఆదాయం 15.8 శాతం పెరిగి రూ.1.59 లక్షల కోట్లకు చేరింది. దిగుమతులపై పన్ను వసూళ్లు మాత్రం 42.2 శాతం దూసుకెళ్లి రూ.72,246 కోట్లకు చేరాయి. గతేడాది అక్టోబర్‌లో దిగుమతులపై ఐజీఎస్టీ వసూళ్లు రూ.50,796 కోట్లుగా ఉన్నాయి.ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2026-27లో ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు స్థూల జీఎస్టీ వసూళ్లు 13.2 శాతం పెరిగి రూ.14.77 లక్షల కోట్లకు చేరాయి. గతేడాది ఇదే కాలంలో ఇవి రూ.13.05 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. నికర వసూళ్లు సైతం 12.6 శాతం వృద్ధితో రూ.12.69 లక్షల కోట్లకు చేరాయి.అక్టోబర్‌లో పన్ను రిఫండ్లు 6.5 శాతం పెరిగి రూ.27,934 కోట్లకు చేరాయి. దేశీయ రిఫండ్లు రూ.14,007 కోట్లు కాగా, ఎగుమతులకు సంబంధించిన రిఫండ్లు రూ.13,927 కోట్లుగా నమోదయ్యాయి. ఏప్రిల్-అక్టోబర్ మధ్య మొత్తం రిఫండ్లు 16.9 శాతం పెరిగి రూ.2.08 లక్షల కోట్లకు చేరాయి

.

విద్యార్థుల భద్రతే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత

మొదటిపేజీ తరువాయి



యువకుడు పదో తరగతి విద్యార్థినిపై దాడి చేసిన దారుణ ఘటన నేపథ్యంలో, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా ఈ పటిష్ఠమైన చర్యలు చేపడుతున్నట్లు ఆయన స్పష్టం చేశారు. విద్యార్థుల రక్షణకే తమ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తుందని, ఈ విషయంలో పటిష్ఠమైన వ్యవస్థను ఏర్పాటు చేస్తామని ఆయన పునరుద్ఘాటించారు.ఆదివారం మధ్యాహ్నం బెంగళూరులోని ఓల్డ్ ఎయిర్‌పోర్ట్ రోడ్డులో ఉన్న మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని మంత్రి లోకేశ్ పరామర్శించారు. బాలిక ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. దాదాపు 12 గంటల పాటు శ్రమించి సంక్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసిన వైద్య బృందాన్ని ఆయన అభినందించారు. అనంతరం బాలిక కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. బాధిత బాలికను తన సొంత కూతురిలా భావించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వపరంగానే కాకుండా, తాను వ్యక్తిగతంగా, స్థానిక శాసనసభ్యురాలిగా పరిటాల సునీత అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఏ అవసరం వచ్చినా సంప్రదించాలని సూచించారు.రాప్తాడు పాఠశాలలో భవిత సెంటర్ నిర్మాణ పనులు జరుగుతుండటంతో, నిందితుడు కార్మికుడి ముసుగులో లోపలికి ప్రవేశించి ఈ దారుణానికి పాల్పడ్డాడని మంత్రి తెలిపారు. ఈ దాడిని ప్రభుత్వం చాలా తీవ్రంగా పరిగణిస్తోందని, నిందితుడిపై చట్టపరంగా అత్యంత కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళలపై దాడులకు పాల్పడే వారికి అదే చివరి రోజయ్యేలా కఠిన చర్యలు ఉంటాయని, ఈ విషయంలో ఎవరినీ ఉపేక్షించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.దాడి జరిగిన వెంటనే బాలికను ఆసుపత్రికి తరలించేందుకు గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేయడంలో తక్షణమే స్పందించిన పోలీసులను మంత్రి అభినందించారు. ప్రస్తుతం బాలిక ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, రాబోయే 48 గంటలు చాలా కీలకమని వైద్యులు తెలిపినట్లు ఆయన వెల్లడించారు. బాలిక సంపూర్ణ ఆరోగ్యంతో సురక్షితంగా ఇంటికి తిరిగి రావాలని అందరూ ప్రార్థించాలని ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ పిలుపునిచ్చారు. ఈ పర్యటనలో మంత్రి వెంట ఎమ్మెల్యేలు పరిటాల సునీత, బండారు శ్రావణి, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ, పాఠశాల విద్య డైరెక్టర్ తమీమ్ అన్సారియా తదితరులు ఉన్నారు.

ఏపీ తీరం వైపు దూసుకొస్తున్న మురసు తుఫాను

మొదటిపేజీ తరువాయి

రాబోయే తుపాను వల్ల పెద్ద సంఖ్యలో విద్యుత్ స్తంభాలు దెబ్బతినే అవకాశం ఉందని చంద్రబాబు తమిళనాడు సీఎంకు వివరించారు. ఈ నేపథ్యంలో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను వేగంగా పునరుద్ధరించేందుకు అవసరమైన సిబ్బందిని, యంత్ర సామగ్రిని ఆంధ్రప్రదేశ్‌కు పంపాలని కోరారు. చంద్రబాబు విజ్ఞప్తికి తమిళనాడు సీఎం విజయ్ వెంటనే సానుకూలంగా స్పందించారు. ఏపీకి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని, తక్షణమే సిబ్బందిని, యంత్రాలను పంపుతామని హామీ ఇచ్చినట్లు తెలిసింది.ఇదిలా ఉండగా, ఇటీవల సంభవించిన 'ఆర్నబ్' తుపాను కారణంగా దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరించే పనుల్లో తెలంగాణ విద్యుత్ సిబ్బంది ఇప్పటికే రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పనిచేస్తున్నారు. ఈ పనులు కొనసాగుతుండగానే మరో తుపాను హెచ్చరికలు రావడంతో ప్రభుత్వం మరింత అప్రమత్తమైంది. అవసరాన్ని బట్టి కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ సహకారం కూడా తీసుకోవాలనే యోచనలో ఏపీ ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం.

నేడే అమిత్ షా పాదయాత్ర

హైదరాబాద్/జీడిమెట్ల, నవంబరు 1(ప్రజావినికిడి): కేంద్ర హోం మంత్రి అమిత్ షా సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహాపాదయాత్రకు బీజేపీ రాష్ట్ర నాయకత్వం ఏర్పాట్లు పూర్తిచేసింది. 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి.. అరాచకాన్ని అరికట్టండి' నినాదంతో బషీర్‌బాగ్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి ఎంజే మార్కెట్ వరకు ఈ పాదయాత్ర సాగనుంది. మధ్యాహ్నం 3 గంటలకు మొదలై సాయంత్రం 6 గంటలకు ముగియనుంది. అమిత్ షాతోపాటు కేంద్ర మంత్రులు జీ కిషన్‌రెడ్డి, బండి సంజయ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారని బీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి ఎన్‌వీ సుభాష్ తెలిపారు. పాదయాత్ర మార్గాన్ని, ఏర్పాట్లను రాంచందర్‌రావు, కిషన్‌రెడ్డి ఆదివారం రాత్రి పరిశీలించారు.ఇదిలా ఉండగా, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి నాయకత్వ లక్షణాలు లేవని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. రాజ్యాంగాన్ని కాపాడాలంటూ కాంగ్రెస్ విచిత్రమైన నాటకమాడుతోందన్నారు. భారతజాతి ఆత్మగౌరవాన్ని, కీర్తిని విదేశాల్లో పలచన చేసేందుకు ప్రయత్నిస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థలపైకాంగ్రెస్ దాడులు చేస్తోందని ఆరోపించారు. ఆదివారం జీడిమెట్లలోని పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సర్ ప్రక్రియ బీజేపీ మొదలుపెట్టింది కాదని, ఇప్పటివరకు 13సార్లు సర్ జరిగిందన్నారు. రాహుల్ గాంధీకి నాయకత్వం వహించే సత్తా లేదని, విదేశాల ఫండింగ్‌తో మీడియాను, సోషల్ మీడియాను మేనేజ్ చేస్తూ ప్రజాస్వామ్యాన్ని విచ్ఛినం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు.

రాప్తాడు ఉన్మాదిపై పోలీసు కాల్పులు

మొదటిపేజీ తరువాయి

అతడు ఆత్మకూరు అటవీప్రాంతంలో తలదాచుకున్నట్లు సమాచారం రావడంతో ఆదివారం మధ్యాహ్నం పోలీసు బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. దీన్ని పసిగట్టిన హేమంత్ తప్పించుకునేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో రాప్తాడు సీఐ వెంకటేశ్వర్లుపై కత్తితో దాడిచేసి గాయపరిచాడు. అనంతరం పారిపోతున్న నిందితుడిపై పోలీసులు కాల్పులు జరిపారు. బుల్లెట్ గాయాలు తగిలి కుప్పకూలిన హేమంత్‌ను సంఘటనా స్థలం నుంచి అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

శనివారం రాప్తాడు జడ్పీ ఉన్నత పాఠశాలలోకి ఎలక్ట్రిక్ రంపం తీసుకుని వెళ్లిన హేమంత్ పదో తరగతి విద్యార్థినిపై భయానకంగా దాడి చేసిన సంగతి తెలిసిందే. బాలిక ముఖం, తల, వీపు భాగాలపై రంపంతో కోసి గాయపరిచాడు. అడ్డుకోబోయిన మరో విద్యార్థినిని కూడా గాయపరిచి అక్కడి నుంచి పారిపోయాడు. బైక్‌పై పారిపోయిన హేమంత్ కోసం పోలీసులు తీవ్రంగా గాలించారు. శనివారం రాత్రి తాడిపత్రి, పుట్లూరు మండలాల్లో గాలించారు. పుట్లూరు మండలంలో సంచరిస్తున్నట్లు సీసీ ఫుటేజీలో రికార్డు అయింది. ఆ తరువాత ఆదివారం మధ్యాహ్నం ఆత్మకూరు అటవీ ప్రాంతంలో ఉన్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో పోలీసు బృందాలు అక్కడికి వెళ్లి గాలింపు చర్యలు చేపట్టాయి. నిందితుడు సాయంత్రం కనిపించగా పోలీసులు పట్టుకునేందుకు యత్నించారు. ఈ క్రమంలో నిందితుడు రాప్తాడు సీఐ వెంకటేశ్వర్లుపై కత్తితో దాడి చేశాడు. తప్పించుకుని దట్టమైన అటవీ ప్రాంతంలోకి పారిపోవాలని చూశాడు. దీంతో పోలీసులు కాల్పులు జరిపారు. నిందితుడి కాళ్లకు బుల్లెట్లు తగలడంతో కుప్పకూలిపోయాడు. పోలీసులు అక్కడి నుంచి అనంతపురం సర్వజన వైద్యశాలకు వాహనంలో తీసుకువచ్చారు. ఆస్పత్రి ప్రధాన గేటు వద్ద వాహనం నుంచి కిందకు దించి ఎమర్జెన్సీ వార్డులోకి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స చేసి ఆపరేషన్ థియేటర్‌కు తరలించారు. హేమంత్‌పై పోలీసులు కాల్పులు జరిపారన్న వార్త తెలియడంతో ఆసుపత్రి వద్దకు ప్రజలు భారీగా చేరుకున్నారు. దీంతో ప్రాంగణం కిక్కిరిసిపోయింది. హేమంత్‌ను ఎన్‌కౌంటర్ చేసినా తప్పులేదని, ఇలాంటి వాడిని ఉరి తీయాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రి వద్ద పోలీసులు భద్రతను పెంచి ప్రజలను కట్టడి చేశారు.

జ్ఞానేశ్ జైలుకే



మొదటిపేజీ తరువాయి

భారీ ర్యాలీలో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు.

"జ్ఞానేశ్ కుమార్ తర్వాత మీ వంతే మోదీజీ" అంటూ ప్రధానిని ఉద్దేశించి హెచ్చరించారు. జ్ఞానేశ్ కుమార్ లేకపోతే మోదీ ప్రధాని, అమిత్ షా హోంమంత్రి అయ్యేవారు కాదని వ్యాఖ్యానించారు. దేశంలో ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసేందుకు ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపు, చేర్పులు చేస్తున్నారని ఆరోపించారు. ఈవీఎంల ద్వారా కూడా ఓట్ల చోరీకి పాల్పడుతున్నారని విమర్శించారు. మధ్యప్రదేశ్, హర్యానా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, కర్ణాటకతో పాటు 2024 లోక్‌సభ ఎన్నికల్లోనూ అక్రమాలు జరిగాయని ఆరోపించారు.

2024 ఎన్నికల తర్వాత దేశంలోని 15 శాతం మంది ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించారని రాహుల్ పేర్కొన్నారు. ఆ ఎన్నికలు చట్టవిరుద్ధంగా జరిగాయని, ప్రజల తీర్పును దొంగిలించారని ఆరోపించారు. ఓటర్ల పేర్ల తొలగింపు దేశద్రోహంతో సమానమని, ఇది అత్యంత తీవ్రమైన కేసుల్లో ఒకటని అభివర్ణించారు. ఈ ఆరోపణలకు ఎన్నికల సంఘం వెల్లడించిన గణాంకాలే ఆధారమని చెప్పారు.

దేశ సంపద కొంత మంది చేతుల్లోనే కేంద్రీకృతమవుతోందని రాహుల్ విమర్శించారు. రైతులు కష్టపడి పండించిన పంటకు తగిన ప్రతిఫలం దక్కాలని, చదువుకున్న విద్యార్థులకు ఉద్యోగాలు రావాలని అన్నారు. యువత, మహిళలు, కార్మికులు, రైతులకు హక్కులు దక్కడం లేదని ఆరోపించారు. దేశం ఇద్దరు ముగ్గురు సంపన్నుల సొత్తు కాదని, ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు ఉండాలని స్పష్టం చేశారు.

అందరూ స్వేచ్ఛగా జీవిస్తూ, తమ కష్టానికి తగిన ఫలితం పొందే భారతదేశం కావాలని ఆకాంక్షించారు. తనకు మతం కంటే ప్రతి భారతీయుడి గొంతుకే ముఖ్యమని చెప్పారు. మోదీ, అమిత్ షా, జ్ఞానేశ్ కుమార్‌లపై తనకు వ్యక్తిగత ద్వేషం లేదని, బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలపై దాడులు చేయబోమని అన్నారు. ప్రేమ, అహింస మార్గంలోనే పోరాడతామని, అయితే రాజ్యాంగాన్ని ధ్వంసం చేయడానికి మాత్రం అనుమతించబోమని హెచ్చరించారు.

ఈ ఆందోళన ఏ ఒక్క పార్టీ కోసం కాదని, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ కోసమని ఇండియా కూటమి నేతలు చెబుతున్నారు. మరోవైపు, ఎన్నికల సంఘం మాత్రం ఓటర్ల జాబితా సవరణలో అనర్హులు, మరణించినవారు, వేరే ప్రాంతాలకు వెళ్లిపోయినవారు, నకిలీ పేర్లను గుర్తించి తొలగిస్తున్నామని వివరిస్తోంది. సవరణలో గుర్తించిన 13.39 కోట్ల పేర్లన్నీ అర్హులైన ఓటర్ల తొలగింపుగా భావించరాదని స్పష్టం చేసింది. పేర్లు తొలగించిన, అర్హులైన ఓటర్లు నిబంధనల ప్రకారం మళ్లీ నమోదు చేసుకోవచ్చని తెలిపింది.



రీపోలింగ్ జరిపితేనే ఓటు వేస్తా

పులివెందులలో ఓటు వేయకుండానే వెనుదిరిగిన జగన్..

పులివెందుల నవంబర్ 01(ప్రజావినికిడి):

కడప జిల్లా పులివెందులలో ఆదివారం జరిగిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. వైసీపీ అధినేత జగన్ తన ఓటు హక్కును వినియోగించుకోకుండానే వెనుదిరిగారు. పులివెందులలో ఎన్నికల ప్రక్రియ అప్రజాస్వామికంగా మారిందని, అధికార టీడీపీ నేతలు యథేచ్ఛగా రిగ్గింగ్, దౌర్జన్యాలకు పాల్పడ్డారని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. రీపోలింగ్ నిర్వహిస్తేనే తాను ఓటు వేస్తానని స్పష్టం చేశారు.

పులివెందులలోని పోలింగ్ కేంద్రానికి వచ్చిన జగన్, అక్కడ నెలకొన్న పరిస్థితులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "నేను ఓటు వేయను. ఒకవేళ నేను ఓటు వేస్తే అంతా సజావుగా సాగుతోందని, అంతా సవ్యంగా ఉందని ప్రజలు అనుకుంటారు. కానీ ఇక్కడ ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోంది. పులివెందులలో ఎన్నికలు రద్దు చేసి, రీపోలింగ్ పెడితేనే వచ్చి ఓటేస్తాను. రాష్ట్రంలో ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో ప్రజలకు తెలియాలి. ఇవాళ ఓటు పోతుంది.. రేపు మీ ఆస్తులే పోతాయి. ఎన్నికల సంఘం, ఎన్నికల అధికారులు చంద్రబాబు చేతిలో తోలుబొమ్మలు" అని ఆయన విమర్శించారు.



ప్రజాస్వామ్యంపై దాడి జరిగిందన్న జగన్

పులివెందుల నియోజకవర్గ పరిధిలోని దాదాపు 80 పోలింగ్ బూత్‌లకు గాను, 70కి పైగా బూత్‌లలోకి తమ పార్టీ ఏజెంట్లను టీడీపీ కార్యకర్తలు రానివ్వలేదని జగన్ ఆరోపించారు. తెల్లవారుజాము నుంచే టీడీపీ వర్గీయులు బూత్‌లను తమ ఆధీనంలోకి తీసుకున్నారని, ఓటర్లను అడ్డుకుని, ఓటరు స్లిప్పులు లాక్కున్నారని మండిపడ్డారు. కొన్నిచోట్ల ఓటర్లను వెనక్కి పంపి, వారి ఓటు ముందే పడిపోయిందని చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో తమ పార్టీ ఏజెంట్ సునందపై దాడి చేయడంతో ఆమె చేతికి గాయమైందని తెలిపారు.

ఈ దౌర్జన్యాలపై పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారని, ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించిన తమ పార్టీ నేతలు, అభ్యర్థులపై లాఠీఛార్జ్ చేశారని జగన్ ఆరోపించారు. ఘటనలను చిత్రీకరిస్తున్న మీడియా ప్రతినిధులపై కూడా దాడులు జరిగాయని విమర్శించారు.

ఆర్వో కార్యాలయం ఎదుట దీక్ష

పోలింగ్ కేంద్రం నుంచి నేరుగా రిటర్నింగ్ అధికారి (ఆర్వో) కార్యాలయానికి చేరుకున్న జగన్, తమ పార్టీకి చెందిన సుమారు 70 మంది పోలింగ్ ఏజెంట్లతో కలిసి అక్కడే బైఠాయించి నిరసన దీక్ష చేపట్టారు. జరిగిన అక్రమాలు, దౌర్జన్యాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బూత్ కబ్జా, రిగ్గింగ్‌కు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్ ఆధారాలతో సహా ఆర్వోకు ఆయన లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. రాష్ట్ర ఎన్నికల సంఘం పనితీరుపై తీవ్ర విమర్శలు చేశారు. "ఈ ఎన్నికల నిర్వహణ తీరు చూస్తే వ్యవస్థలో సంస్కరణలు ఎంత అవసరమో అర్థమవుతోంది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఎవరి చేతుల్లో ఉందో అందరికీ తెలుసు" అని వ్యాఖ్యానించారు. తాను ఒక్క పిలుపు ఇచ్చి ఉంటే ఎన్నికలు ఆగిపోయేవని, కానీ ప్రజాస్వామ్య నిబంధనలకు గౌరవం ఇచ్చి సంయమనం పాటించానని అన్నారు. ఈ అక్రమాలకు పాల్పడిన ప్రతి ఒక్క అధికారి భవిష్యత్తులో విచారణ ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ ఇలాంటి అక్రమాలే జరిగాయని వైసీపీ నేతలు ఆరోపించారు.

పురపోరు ప్రశాంతం!

మొదటిపేజీ తరువాయి

తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించారు. ఈ ఎన్నికల కోసం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 99 లక్షల మంది ఓటర్లు అర్హత పొందగా, 11,000 పైగా పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది.

ఓటింగ్ సరళి.. ఆసక్తికర గణాంకాలు

ఈ ఎన్నికల్లో ఓటింగ్ సరళి విభిన్నంగా కనిపించింది. ప్రధాన నగరాల్లో ఓటర్లు ఓటు వేయడానికి పెద్దగా ఆసక్తి చూపకపోగా, చిన్న పట్టణాలు, మున్సిపాలిటీల్లో మాత్రం ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన గణాంకాల ప్రకారం, మధ్యాహ్నం 3 గంటల సమయానికి రాష్ట్ర సగటు పోలింగ్ శాతం 48.03%గా నమోదైంది. ప్రధాన నగరాలైన విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, తిరుపతి వంటి చోట్ల పోలింగ్ మందకొడిగా సాగింది. అదే సమయంలో చిన్న పట్టణాల్లో ఓటర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. సాయంత్రం 5 గంటల వరకు తుది పోలింగ్ శాతం మరింత పెరిగే అవకాశం ఉంది

కొన్ని ప్రాంతాల్లో అధికార పార్టీ అక్రమాలకు పాల్పడిందని, రీపోలింగ్ నిర్వహించాలని వైసీపీ నేతలు డిమాండ్ చేశారు. ఒంగోలులో టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. పాలకొండలో ఓ నవ వధువు పెళ్లి దుస్తుల్లోనే పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేయడం అందరి దృష్టిని ఆకర్షించింది. మొత్తం మీద, పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో అందరి దృష్టి ఇప్పుడు నవంబర్ 3న జరిగే ఓట్ల లెక్కింపుపైనే ఉంది.

శాంతిభద్రతలకు అధిక ప్రాధాన్యం: ఎస్ఈసీ


రాష్ట్రంలో 92 పట్టణ సంస్థల్లో ఆదివారం పోలింగ్ ప్రశాంతం గా జరిగిందని రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) వెల్లడించింది. కడప జిల్లా పులివెందులలో మాత్రమే మాజీ సీఎం జగన్ పర్యటన నేపథ్యంలో టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య ఘర్షణలు, రాళ్లదాడి వంటి ఘటనలు చోటు చేసుకున్నాయని.. మిగిలిన రాష్ట్రమంతటా పోలింగ్ ప్రక్రియ శాంతియుతంగా కొనసాగిందని తెలిపింది. కొన్ని చోట్ల బ్యాలెట్ పేపర్లు మారిపోవడంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. ఎక్కడా ఎన్నికలు నిలిచిపోలేదు. 2021నాటి స్థానిక ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఎన్నికల నిర్వహణలో భద్రత, సాంకేతిక పర్యవేక్షణకు ప్రాధాన్యమిచ్చారు. 36,351 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించేందుకు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఏర్పాటుచేసిన 13,500 సీసీ కెమెరాల ద్వారా వెబ్‌కాస్టింగ్ ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా, రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి ఎ.మల్లికార్జున పరిశీలించారు. ఎన్నికల నిర్వహణలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యమిచ్చామని, జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లు, డీఐజీలు, ఎన్నికల పరిశీలకులతో సమీక్షలు నిర్వహించామని పునేఠా తెలిపారు. ఎస్ఈసీ కార్యాలయంలో మల్లికార్జున, ఐజీ రాజకుమారితో కలిసి ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ ప్రాంతాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఫిర్యాదులు, వినతులు అందాయని చెప్పారు. వాటిపై ఎప్పటికప్పుడు పోలీసు శాఖ, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, కమిషనర్లతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. విజయవాడలోని 55వ వార్డులో సాంకేతిక, ఇతర కారణాలతో సుమారు రెండున్నర గంటల ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైన నేపథ్యంలో.. పోలింగ్ సమయాన్ని రాత్రి 7.30 గంటల వర కు పొడిగించినట్లు తెలిపారు. పల్నాడు, అనంతపురం జిల్లాల్లో కొన్ని ఘటనలు జరిగినట్లు కలెక్టర్లు ఎస్ఈసీ దృష్టికి తెచ్చారని పునేఠా తెలిపారు. ఐజీ రాజకుమారి మాట్లాడుతూ.. పోలింగ్ సం దర్భంగా సుమారు 40 ఘటనలు చోటుచేసుకున్నాయని.. వీటిపై 275 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు తెలిపారు.

13 కార్పొరేషన్లలో పోలింగ్ శాతం

తిరుపతి 46.85
అనంతపురం 56.12
కడప 69.58
కర్నూలు 53.77
చిత్తూరు 62.40
నెల్లూరు 57.72
ఒంగోలు 71.27
గుంటూరు 56.15
విజయవాడ 55.35
మచిలీపట్నం 70.83
ఏలూరు 59.64
గ్రేటర్ విశాఖ 50.02
విజయనగరం 62.93

జిల్లాలవారీగా పోలింగ్ ఇలా..

అనంతపురం 62.45
శ్రీసత్యసాయి 72.53
చిత్తూరు 68.75
తిరుపతి 53.65
అన్నమయ్య 62.48
కడప 70.06
కర్నూలు 55.28



నంద్యాల 67.06
నెల్లూరు 58.91
ఒంగోలు 69.00
బాపట్ల 71.09
గుంటూరు 57.12
పల్నాడు 69.81
ఎన్టీఆర్ 72.75
కృష్ణా 72.82
తూర్పు గోదావరి 72.75
కాకినాడ 70.81
కోనసీమ 72.90
పశ్చిమ గోదావరి 72.48
ఏలూరు 61.51
అనకాపల్లి 74.6
విశాఖపట్నం 51.47
విజయనగరం 62.65
పార్వతీపురం మన్యం 68.04
శ్రీకాకుళం 65.55

మహా ధర్నాకు వేలాదిగా తరలిరండి

1/70,పీసా చట్టాల అమలుకై ఆదివాసీలంతా కదలాలి

ఎఎన్ఎస్,రాష్ట్ర సోషల్ మీడియా ప్రతినిధి పాయం.అజయ్



వాజేడు, నవంబర్ 2, (ప్రజావినికిడి):వాజేడు మండలంలోని పెనుగోల్ గ్రామంలో ఎఎన్ఎస్, ఆదివాసి నవనిర్మాణ సేనా నాయకులు పాయం శివాజీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎఎన్ఎస్, ఆదివాసి నవనిర్మాణ సేనా రాష్ట్ర సోషల్ మీడియా ప్రతినిధి పాయం అజయ్ మాట్లాడుతూ, నవంబర్ 2,న వెంకటాపురం మండల కేంద్రంలో ఆదివాసి హక్కులు 1/70, పీసా చట్టాలు అమలు కొరకు జరిగే మహా ధర్నాకు ఆదివాసి సర్పంచులు,వార్డు సభ్యులు, ప్రతి ఒక్క ఆదివాసీ ప్రజా ప్రతినిధులు,యువతి యువకులు మహిళలు ఆదివాసి పెద్దలు అందరూ అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయలని, ఆదివాసీ హక్కుల చట్టాల అమలు కోసం ప్రతి ఒక్కరూ కదం తొక్కలని, భవిష్యత్ తరాలు ఆగం కాకుండా ఉండాలంటే, అందరూ కదలాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే 1/70 చట్టం,పీసా చట్టాలన్ని కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాయని, ఇప్పటికైనా ఆదివాసీలు కళ్ళు తెరుచుకోకపోతే భవిష్యత్తు తరాలు బుగ్గిపాలు అవుతాయని ఎఎన్ఎస్, ఆదివాసి నవనిర్మాణ సేనా రాష్ట్ర సోషల్ మీడియా ప్రతినిధి పాయం అజయ్ అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎస్, నాయకులు పాయం శివాజి, కృష్ణమూర్తి, బొగ్గుల మల్లయ్య, సారక్క,రవి, మహేష్, రజినీకాంత్, సతీష్,రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టుల సాధనకు లక్ష సంతకాల మహోద్యమం

షాద్‌నగర్‌లో జోరుగా కొనసాగుతున్న సంతకాల సేకరణ



షాద్ నగర్,(ప్రజావినికిడి):ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలనే డిమాండ్‌తో పండుగ సాయన్న స్ఫూర్తిగా పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ చేపట్టిన లక్ష సంతకాల మహోద్యమం కొనసాగుతోంది.ఇందులో భాగంగా ఆదివారం షాద్‌నగర్ బస్టాండ్ ఆవరణలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు.షాద్‌నగర్ జేఏసీ కన్వీనర్ టీజీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని కోరుతూ ప్రజలు పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా సంతకాలు చేశారు.ఈ కార్యక్రమంలో జేఏసీ కో-ఆర్డినేటర్ రవీంద్రనాథ్, కో-కన్వీనర్ అర్జునప్ప, కార్యనిర్వాహక సభ్యులు ఆకాష్ నాయక్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు

నాగోల్‌లో ఇద్దరు చిన్నారులు అదృశ్యం

నాగోల్,(ప్రజావినికిడి):



నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సాయిరాం నగర్ కాలనీలో ఇద్దరు చిన్నారులు అదృశ్యమైన ఘటన కలకలం రేపింది. సాయిరాం నగర్ కాలనీ,రోడ్ నంబర్ 3కు చెందిన మొగిలి శిరీష (28) తన ఇద్దరు కుమారులు వరుణ్ తేజ్ (8), మహేష్ (6) కనిపించడం లేదంటూ నాగోల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.వివరాల్లోకి వెళితే,వరుణ్ తేజ్ నాలుగో తరగతి,మహేష్ రెండో తరగతి నాగోల్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు.ఈ నెల 31వ తేదీ ఉదయం తల్లి పనికి వెళ్లి రాత్రి సుమారు 9:30 గంటలకు ఇంటికి తిరిగి వచ్చింది.ఇంట్లో పిల్లలు కనిపించకపోవడంతో తొలుత పాఠశాలకు వెళ్లి ఉంటారని భావించింది. అనంతరం పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయులను విచారించగా, ఆ రోజు ఇద్దరు చిన్నారులు పాఠశాలకు రాలేదని తెలిపారు.దీంతో ఆందోళనకు గురైన తల్లి వెంటనే నాగోల్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు ఫిర్యాదు స్వీకరించి,ఇద్దరు చిన్నారుల ఆచూకీ కోసం దర్యాప్తు చేపట్టారు.

దేవులపల్లి అశోక్ కుమార్ జన్మదిన వేడుకలు

ఎల్బీనగర్, (ప్రజావినికిడి):



దేవులపల్లి అశోక్ కుమార్ జన్మదినం సందర్భంగా నాగోల్ లో వారి స్వగృహంలో జరిగిన జన్మదిన ఉత్సవంలో పాల్గొన్న తెలంగాణ బ్రాహ్మణ సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు పోచంపల్లి రామారావు. తెలంగాణ బ్రాహ్మణ సంఘ సమైక్య రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సహాయ కార్యదర్శి దేవులపల్లి అశోక్ కుమార్ 70 వసంతాలు పూర్తిచేసుకుని 71 సంవత్సరంలో అడుగుడుతున్న సందర్భంలో వారిని వారిని నివాసములు వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ శాలువాతో సత్కరించి వారి పరిపూర్ణ ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో శతమానం ఉండాలని కోరుకుంటూ పలువురు బ్రాహ్మణ పెద్దలు తెలంగాణ బ్రాహ్మణ సంఘ సమైక్య రాష్ట్ర అధ్యక్షులు పోచంపల్లి రమణారావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవులపల్లి రంగారావు, చకిలం నరసింహారావు, మంత్రి లీల బాయ్,కట్టెకోల యాదగిరిరావు, అశోక్ కుమార్ వారి సతీమణి దేవులపల్లి రమాదేవి, కుమారుడు దేవులపల్లి కౌశిక్, పసునూరి సురేష్ కుమార్,తదితర బ్రాహ్మణ మరియు శ్రీవైష్ణవి చారిటబుల్ ట్రస్ట్ మెంబర్స్ అశోక్ కుమార్ ని ఘనంగా సత్కరించారు.

యుద్ధాలు లేని సమాజమే ప్రపంచశాంతికి మార్గం





రంగారెడ్డి,(ప్రజావినికిడి):
ప్రపంచమంతా యుద్ధ భయంతో అశాంతి వాతావరణంలో జీవిస్తున్న ప్రస్తుత తరుణంలో,ఈ భూగోళంపై యుద్ధాలు లేని సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అఖిలభారత శాంతి సంఘీభావ సంఘం రంగారెడ్డి జిల్లా మహాసభలో ముఖ్య అతిథులు పిలుపునిచ్చారు. ప్రపంచ శాంతి, మానవ హక్కుల పరిరక్షణ,దేశాల సార్వభౌమాధికారానికి గౌరవం, ప్రజాస్వామ్య-సెక్యులర్ విలువల పరిరక్షణ కోసం ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని నేతలు స్పష్టం చేశారు.అఖిలభారత శాంతి సంఘీభావ సంఘం రంగారెడ్డి జిల్లా మహాసభ ఆదివారం టీఎన్జీవో భవన్‌లో తిప్పర్తి మహేష్,పల్లె వినయ్ అధ్యక్షతన నిర్వహించారు. మహాసభను ప్రారంభించిన సంఘం రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కేవిఎల్ మాట్లాడుతూ, ప్రపంచంలోని అనేక దేశాలు యుద్ధ భయంతో జీవిస్తున్నాయని అన్నారు.ఏ క్షణంలో యుద్ధాల కారణంగా దేశాలు,మానవ సమాజం అతలాకుతలమవుతుందోనన్న ఆందోళన నెలకొని ఉందని పేర్కొన్నారు. యుద్ధాలు లేని సమాజ నిర్మాణమే అఖిలభారత శాంతి సంఘీభావ సంఘం ప్రధాన లక్ష్యమని తెలిపారు.
ప్రపంచ శాంతి కోసం యూరప్ దేశాల్లో ప్రజలు లక్షల సంఖ్యలో ప్రదర్శనలు నిర్వహిస్తూ యుద్ధోన్మాదానికి, సామ్రాజ్యవాద విధానాలకు వ్యతిరేకంగా తమ గొంతును వినిపిస్తున్నారని గుర్తుచేశారు. దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, సెక్యులర్ విలువలను పరిరక్షించడం ద్వారానే ప్రజల సంక్షేమం,దేశ ప్రగతి సాధ్యమవుతుందని అన్నారు.



ప్రజల్లో చైతన్యం పెంచుతూ శాంతియుత సమాజ నిర్మాణానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.సంఘం అధ్యక్ష మండలి సభ్యుడు బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ, ప్రపంచ ప్రజల చైతన్యం ముందు నియంతృత్వ, యుద్ధోన్మాద శక్తులు నిలవలేవని చరిత్ర స్పష్టం చేస్తోందన్నారు. ప్రపంచ మానవాళి హక్కుల పరిరక్షణ,అన్ని దేశాల సార్వభౌమాధికారానికి గౌరవం, ఐక్యరాజ్యసమితి విధివిధానాల అమలు కోసం శాంతి ఉద్యమకారులు పోరాడుతున్నారని తెలిపారు. ప్రపంచంలో శాంతి,సంక్షేమం, అభివృద్ధి సాధన కోసం ప్రజలందరూ ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు.అధ్యక్ష మండలి సభ్యుడు తిప్పర్తి యాదయ్య మహాసభల పథకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ, ప్రజలు రాజకీయ పార్టీలుగా, ఇతర అంశాలపై విభిన్నంగా ఉన్నప్పటికీ శాంతి విషయంలో మాత్రం ఒక్కటిగా నిలవాలని అన్నారు. పాలకులు తమ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలు ప్రశ్నించకుండా ఉండేందుకు సమాజంలో విభజనలు, అశాంతి, అభద్రతను సృష్టించే ప్రయత్నాలు చేస్తుంటారని ఆరోపించారు.ఈ పరిణామాలను ప్రజలంతా అర్థం చేసుకుని న్యాయం,శాంతి, అభివృద్ధి కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ సమత మాట్లాడుతూ, కుల,మత రహిత సమాజ నిర్మాణం కోసం అనేక మంది పోరాటం చేస్తున్నారని తెలిపారు.కులం, మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెట్టే శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమాజంలో మానవతా విలువలు మరింత బలపడాలని, కులమత భేదాలకు అతీతంగా ప్రజలు ఆలోచించే పరిస్థితి రావాలని ఆకాంక్షించారు. ఇటీవల మృతదేహాలను కులమతాచారాలకు అతీతంగా వైద్య,విద్యా అవసరాల కోసం ఆసుపత్రులకు అందించే మానవతా దృక్పథం పెరుగుతుండటం మంచి సంప్రదాయమని ఆమె అభిప్రాయపడ్డారు.ఈ మహాసభలో రాష్ట్ర నాయకులు పల్లె వినయ్,తిప్పర్తి మహేష్, పోలగాని రవికిషోర్, ప్రజానాట్యమండలి నాయకుడు పల్లె నరసింహ, వి.గణేష్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు కలకొండ కాంతయ్య, వర్కర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పాండురంగాచారి,నిర్వాహకులుట ఇరుగు శ్రీధర్, పల్లె వెంకన్న,చిత్రం సైదులు,శ్రీశైలం గౌడ్,జీనుకుంట్ల లింగయ్య, ఆంజనేయులు, పరమేష్, నాగేశప్ప, నరసింహ, క్రాంతి,శ్రీనివాస్, అరుణ్ గౌడ్, మణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చించోడ్ గ్రామంలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు





షాద్ నగర్,(ప్రజావినికిడి): నియోజకవర్గంలోని ఫరూఖ్ నగర్ మండలం చించోడ్ గ్రామం, పటేల్ కుంట తండాకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ షాద్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై. అంజయ్య యాదవ్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. నాయకులు గౌస్ ఖాన్,లచ్చు నాయక్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీని వీడి గులాబీ గూటికి చేరారు.ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ నాయకత్వంలో సాగిన ప్రజా సంక్షేమ పాలనను ప్రజలు మరోసారి కోరుకుంటున్నారని అన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రైతులకు,అన్ని వర్గాల ప్రజలకు అందిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు నేటికీ గుర్తు చేసుకుంటున్నారని పేర్కొన్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు.కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉండి ఉంటే రాష్ట్రంలో పరిస్థితులు మరోలా ఉండేవని అభిప్రాయపడ్డారు.ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని, దీంతో ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తుందని తెలిపారు. పార్టీలో చేరిన ప్రతి నాయకుడు, కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని,అందరూ ఐక్యంగా పనిచేసి షాద్‌నగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు, కార్యకర్తలు..లచ్చు నాయక్, శ్రీకాంత్, సంతోష్,ప్రవీణ్ కుమార్,నవీన్, గణేష్,రాజేష్, బసు,పి.టి. ప్రకాష్,సోను ప్రకాష్,లడ్డు, సోను,అశోక్, చింటూ,చందర్ నాయక్,మెగ్యా నాయక్,ప్రతాప్ నాయక్, సురేష్,గణేష్ తొల్యా, ప్రసాద్, కిషన్ నాయక్, నాగ చైతన్య,దశరథ్ నాయక్, ధర్మ నాయక్, షక్రు నాయక్, శంకర్ నాయక్,వంశీ,నర్సింహ నాయక్, రేక్యా నాయక్, లక్ష్మణ్ నాయక్,శ్రీను చున్నుమియా నాయక్, బద్రి,వినోద్ నాయక్,శ్రీను జేసీబీ నాయక్,తరుణ్, సోని నాయక్, నరేష్ నాయక్, రెడ్డి నాయక్, రమేష్ నాయక్, గౌస్ ఖాన్,నవాబ్,ఖదీర్ భాయ్, సిరాజ్,అలీ,ఘనీ మియా, షోయబ్, అను ఎండీ,మోసిన్ ఎండీ,టి.రాజు, అరుణ్,సాయికుమార్,నరసింహ,కిరణ్,ప్రవీణ్,ప్రకాష్ తదితరులు ఉన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, మండల అధ్యక్షులు లక్ష్మణ్ నాయక్, సర్పంచ్ గీత వీరేశం,మాజీ సర్పంచులు రంగయ్య గౌడ్, మచ్చేందర్,స్థానిక మాజీ సర్పంచ్ దామోదర్ తోపాటు బాలరాజ్ పి.లోకేష్, మహమ్మద్,అన్వర్, మహబూబ్, రమేష్,రాజేష్, సిద్దయ్య, అమీర్,జి.శివ,గణేష్, ప్రతాప్, నరేష్, శ్రీను, వినోద్, నర్సింహులు, సద్దాం,ప్రవీణ్, శ్రీను బద్రు, కె.పండు,జి.వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో బిగ్ ట్విస్ట్.
. హరీశ్‌రావుపై మరిన్ని సెక్షన్లతో కొత్త ఎఫ్ఐఆర్

హరీశ్‌ను ఏ1గా, మాజీ డీసీపీ రాధాకిషన్‌రావును ఏ2గా చేర్చిన పోలీసులు

హైకోర్టు ఆదేశాలతో పంజాగుట్ట నుంచి సిద్దిపేటకు కేసు బదిలీ

పాత ఎఫ్ఐఆర్ కంటే అదనంగా పలు సెక్షన్ల కింద కేసు నమోదు



హైదరాబాద్/ నవంబరు 1(ప్రజావినికిడి):
ఫోన్ ట్యాపింగ్ ఆరోపణల నేపథ్యంలో బీఆర్ఎస్ సీనియర్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే టి. హరీశ్‌రావుపై సిద్దిపేట పోలీసులు తాజాగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసులో హరీశ్‌రావును మొదటి నిందితుడుగా (ఏ1), టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావును రెండో నిందితుడిగా (ఏ2) చేర్చారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఈ కేసును పంజాగుట్ట పోలీస్ స్టేషన్ నుంచి సిద్దిపేటకు బదిలీ చేసి, ఇక్కడ కొత్తగా ఎఫ్ఐఆర్ నమోదు చేయడం గమనార్హం.
సిద్దిపేటకు చెందిన వ్యాపారవేత్త చక్రధర్ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈ కేసు నమోదైంది. మరణించిన రైతుల కుటుంబాలకు తాను ఆర్థిక సాయం అందిస్తుండటంతో, తన పట్ల పెరుగుతున్న ప్రజాదరణను చూసి హరీశ్‌రావు కక్ష పెంచుకున్నారని చక్రధర్ గౌడ్ ఆరోపించారు. మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు ద్వారా తనను బెదిరించి, అక్రమ కేసుల్లో ఇరికించేందుకు కుట్ర పన్నారని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. తనతో పాటు తన భార్య ఫోన్లను కూడా ట్యాప్ చేశారని, ఈ విషయాన్ని యాపిల్ సంస్థ పంపిన హెచ్చరిక సందేశాలు ద్వారా గుర్తించానని ఆయన వివరించారు.
ఈ వ్యవహారంపై చక్రధర్ గౌడ్ తొలుత 2024 డిసెంబర్ 1న పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసు విచారణ క్రమంలో సుప్రీంకోర్టు వరకు వెళ్లగా, అనంతరం కేసును సిద్దిపేటకు బదిలీ చేసి కొత్త ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.
హైకోర్టు ఆదేశాల మేరకు సిద్దిపేట పోలీసులు పాత ఎఫ్ఐఆర్‌లోని అంశాలతో పాటు మరిన్ని అదనపు సెక్షన్లను ఈ కేసులో చేర్చారు. ఐపీసీ సెక్షన్లు 120బీ, 386, 409, 506, 419, 420, 467, 406 రెడ్ విత్ 34తో పాటు ఐటీ చట్టంలోని సెక్షన్ 66డీ కింద హరీశ్‌రావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

హైదరాబాద్‌లో లేడీ కిలాడి

: ఆన్‌లైన్‌లో చూసి చోరీలు.. అరెస్ట్ చేసిన పోలీసులు

హైదరాబాద్‌లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న 25 ఏళ్ల యువతి అరెస్ట్

బురఖా ధరించి, కట్టర్ మెషిన్‌తో తాళాలు పగలగొట్టి చోరీలు

ఆన్‌లైన్ వీడియోలు చూసి దొంగతనం టెక్నిక్స్ నేర్చుకున్న నిందితురాలు

సుమారు రూ. 70 లక్షల విలువైన బంగారం, వెండి, నగదు స్వాధీనం

ఆర్థిక ఇబ్బందుల వల్లే నేరాలకు పాల్పడినట్లు పోలీసుల వెల్లడి



హైదరాబాద్‌నవంబరు 1(ప్రజావినికిడి):

హైదరాబాద్ నగరంలో వరుస దొంగతనాలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్ విసిరిన 25 ఏళ్ల యువతిని ఉప్పల్ జోన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆన్‌లైన్ వీడియోలు చూసి దొంగతనం చేసే పద్ధతులు నేర్చుకుని, తనను ఎవరూ గుర్తుపట్టకుండా బురఖా ధరించి నేరాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. నిందితురాలి నుంచి సుమారు రూ. 70 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు, నగదు స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన పాగ జయ (25) ఆర్థిక ఇబ్బందుల కారణంగా బీటెక్ మొదటి సంవత్సరంలోనే చదువు ఆపేసింది. 2023లో హైదరాబాద్‌కు వచ్చి, 2024లో వివాహం చేసుకుని న్యూ భరత్ నగర్ కాలనీలో నివసిస్తోంది. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో దొంగతనాలను ఎంచుకుంది. ఇందుకోసం ఆన్‌లైన్ వీడియోల ద్వారా తాళాలు పగలగొట్టే పద్ధతులను నేర్చుకుంది.పగటిపూట తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని, తన గుర్తింపు బయటపడకుండా నల్లటి బురఖా, చేతికి గ్లౌజులు ధరించేది. బ్యాక్‌ప్యాక్‌లో హ్యాండ్ కటింగ్ మెషిన్ తీసుకెళ్లి, దానితో ఇంటి తాళాలు, బీరువాలు పగలగొట్టి బంగారం, వెండి, నగదు దోచుకెళ్లేది.అక్టోబర్ 26న ఉప్పల్‌లోని న్యూ భరత్ నగర్ కాలనీలో ఓ కుటుంబం గుడికి వెళ్లిన సమయంలో జయ వారి ఇంట్లో చోరీకి పాల్పడింది. మరుసటి రోజు ఇంటి యజమానులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా, నల్లటి బురఖా, నీలం రంగు బ్యాక్‌ప్యాక్‌తో ఉన్న మహిళ కదలికలు అనుమానాస్పదంగా కనిపించాయి. దీని ఆధారంగా దర్యాప్తు చేపట్టిన ఉప్పల్ పోలీసులు, మల్కాజ్‌గిరి సీసీఎస్ బృందం.. అక్టోబర్ 31న ఉప్పల్ ఎక్స్ రోడ్స్ వద్ద జయను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ఆమె ఐదు దొంగతనాలు చేసినట్లు అంగీకరించింది.నిందితురాలి నుంచి 560 గ్రాముల బంగారం, 1.5 కిలోల వెండి వస్తువులు, కొంత నగదు, ఒక ఐఫోన్ 17ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఉప్పల్, మేడిపల్లి, జగద్గిరిగుట్ట, భద్రాద్రి కొత్తగూడెం టూ టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఆమెపై కేసులు నమోదైనట్లు అధికారులు తెలిపారు. నిందితురాలిని జ్యుడీషియల్ కస్టడీకి తరలించి, కేసుపై మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.


బడా బాబులకు అనుమతులు

భయం గుప్పిట్లో స్థానిక ప్రజలు

భూగర్భ 220 కేవీ లైన్,టవర్ల నిర్మాణ నీడలో ఎలికట్ట ప్రజలు -అనుమతులు ఇచ్చాం..

ఆపై మాకు సంబంధం లేదు..అంటున్న ఇరిగేషన్ శాఖ.. -ఆర్& బీ శాఖ అధికారులు..


ఇరు శాఖలపై నిప్పులు చెరిగిన షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే,టీడీపీ పాలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నరసింహులు..


Please take notice that as per Condition No. 10 of your permission letter, any deviation from the approved specifications automatically deems your permission cancelled. Failure to halt operations immediately and re-align the utility line at the mandatory 10.0-meter setback will result in the immediate revocation of your road cutting permission without further notice.

Yours faithfully,
24/11/26
Deputy Executive Engineer (R&B)
Shadnagar - Sub Division
Ranga Reddy District.

Copy submitted to:

ఎలికట్టలో 220 కెవి అండర్ గ్రౌండ్ కేబుల్ పనులు నిలపలని నోటీసు జారీ చేసిన ఆర్&బి శాఖ


5. Permission is limited to specified location only for the proposed High Tension (HT) line tower (P-LOC-39-A) as per the TGTRANSCO approval. Any shifting of Tower line will not confirm this approval.
6. The design aspects of laying of towers and foundation and its execution etc., lies with the executing department only.
7. The Clarification of land in Patta/Govt. Land will not lie with I & CAD Dept. The user department is responsible for this aspect.
8. Any damages due to flood and other aspects occured during execution and occurring in future, this department will not be responsible for any damages/losses as the tower is proposed in buffer zone.

Yours faithfully,
Superintending Engineer,
Irrigation Circle, Chevella.

బఫర్ జోన్ లో నిర్మాణం..నష్టం జరిగితే మాకు సంబంధం లేదు ఇరిగేషన్ శాఖ



మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు

షాద్ నగర్,(ప్రజావినికిడి):

రంగారెడ్డి జిల్లా ఫరుక్ నగర్ మండలం ఎలికట్ట గ్రామంలో భూగర్భ 220 కేవీ హైటెన్షన్ లైన్, ప్రతిపాదన రైతులు,అలాగే రాబోవు రోజుల్లో నాలుగు వరుసల రహదారిగా విస్తరించనున్న షాద్ నగర్-పరిగి రహదారిపై ఇష్టానుసారంగా రోడ్డున తవ్వేస్తున్న ప్రైవేట్ సంస్థలు,తీవ్ర ఆందోళన రేపుతోంది.

పొలాల మీదుగా, ఇళ్లపక్కనుంచి, రహదారి,వాగులు, నీటి వనరులను దాటుకుంటూ హెచ్‌టీ టవర్లు, భూగర్భ లైన్లు నిర్మితంపై గ్రామ ప్రజలకు భయం వ్యాపించింది.ఈ నేపథ్యంలో షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే,టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నరసింహులు గతంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు,సంబంధిత అధికారులకు వినతిపత్రం సమర్పించిన ఫలితం మాత్రం శూన్యం.. రైతులు,నివాసితులు,ప్రైవేట్ భూ యజమానుల సమస్యలు పరిష్కరించాకే పనులు మొదలుపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

అనుమతులు అయితే ఇచ్చాం నష్టం జరిగితే మాకు సంబంధం లేదు అంటున్న ఇరిగేషన్ శాఖ

ఇరిగేషన్ శాఖ చేవెళ్ల ఎస్ ఇ ప్రతిపాదిత 220 కెవి పనుల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చాము కానీ దానివల్ల జరిగే విపత్తుకు మాకు ఎలాంటి సంబంధం ఉండదని లేఖలో స్పష్టంగా వెల్లడించి, అనుమతులు ఇవ్వడం శోచనీయంగా మారిందన్నారు. హై టెన్షన్ టవర్ ల నిర్మాణం ద్వారా భవిష్యత్తులో ప్రాణా, ఆస్తి నష్టం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ఆయన ఆగ్రహం వ్యక్తపరిచారు.

ఆర్&బి శాఖ అధికారుల అనుమతుల్లో విస్తుపోయే అంశాలు..

ఎలికట్ట చౌరస్తా నుండి పరిగి వరకు రానున్న రోజుల్లో నాలుగు వరుసల రహదారిగా విస్తరించిన నేపథ్యంలో ఓ ప్రైవేట్ సంస్థకు భూగర్భ 220 కె.వి అండర్ లైన్ పరిమిషన్ జారీ చేసి అనుమతుల్లో ఆర్ &బి డి ఈ లేఖలో స్పష్టంగా భవిష్యత్తులో రోడ్డు విస్తరణ నేపథ్యంలో లైను మార్చాల్సి వస్తే ఎలాంటి నష్టపరిహారం అడగకూడదని స్పష్టంగా లేఖలో నమోదు చేసి వారికి అనుమతులు ఇవ్వడం శోచనీయంగా మారింది.మరి రానున్న రోజులలో రోడ్డు విస్తరణ జరుగుతుందని తెలిసిన ఆర్ &బీ శాఖ అధికారులు రోడ్డుకు అనుకొని అనుమతులు ఎలా ఇచ్చారు. 10 మీటర్ల సెట్ బ్యాక్ అని,తీరా చూస్తే1 మీటరు రోడ్డున తవ్వి పనులు నిర్వహిస్తున్నారని ఆయన మండిపడ్డారు.

ఎవరి కోసం ఈ లైన్ లు,ఎవరిపై భారం.?

220 కేవీ విద్యుత్ సరఫరా కోసం ఈ లైన్‌ను ప్రతిపాదించారు. ఇది ప్రైవేట్ పట్టాభూములు, రహదారులు,వ్యవసాయ భూములు,నివాస ప్రాంతాలపై ప్రభావం చూపుతుందని వినతిపత్రంలో పేర్కొన్నారు. వాగులు,నీటి వనరులు,ఎఫ్‌టీఎల్,బఫర్ జోన్లు,సహజ డ్రైనేజీ ప్రాంతాలకూ ముప్పు ఉందని ఆయన హెచ్చరించారు.14:10:2026న సంబంధిత కంపెనీకి అనుమతులు జారీ చేసి మరల 24:10:2026 రోజున పనులు నిలిపివేయాలని మరో జీవో జారీ చేయడం,అయినా కూడా పనులు నిలపకపోవడంతో,ఈ విషయం స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలియడంతో ఆర్ అండ్ బి శాఖ డీఈకి ఫోన్ లో మాట్లాడి అనుమతులు రద్దు చేసి పనులు నిలిపివేయాలని హెచ్చరించినపనులు యధావిధిగా కొనసాగుతున్నాయని ఆయన మండిపడ్డారు.

ఇరిగేషన్ శాఖ అధికారులు సర్వే పరిశీలన శూన్యం

ఇరిగేషన్,అధికారులు క్షేత్రస్థాయి సర్వే పరిశీలన చేయాలని నరసింహులు డిమాండ్ చేశారు.ప్రతి టవర్ స్థానం,సర్వే నంబర్,భూమి యాజమాన్యం,భూమి స్వభావాన్ని నిర్ధారించాలన్నారు.టవర్ పి ఎల్ఓసి-39-ఏ విషయంలో చెవెళ్ల ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ 2026 సెప్టెంబర్ 9న ఇచ్చిన ఉత్తర్వులను ఆయన గుర్తుచేశారు. వాగు ప్రవాహానికి ఆటంకం కలిగించరాదని,బఫర్ ప్రాంతాన్ని కాపాడాలని ఆ ఉత్తర్వుల్లో స్పష్టంగా ఉందన్నారు.ప్రస్తుత అలైన్‌మెంట్ వల్ల ప్రైవేట్ భూములు, వ్యవసాయం,నివాస ప్రాంతాలపై అధిక ప్రభావం ఉంటే, సాంకేతికంగా సాధ్యమయ్యే ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు.

హక్కులపై హడావుడి.. ఆచరణలో ఏముంది?

నెలకోసారి సభలు.. ప్రజల్లో చైతన్యం ఎంత? -అంటరానితనంపై చట్టాలున్నా.. క్షేత్రస్థాయిలో మార్పేదీ?

హైదరాబాద్‌నవంబరు 1(ప్రజావినికిడి):

సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు ఉండాలి. కులం, మతం, సామాజిక నేపథ్యం ఆధారంగా ఎవరూ వివక్షకు గురికాకూడదు. అంటరానితనం పూర్తిగా నిర్మూలించబడాలి. రాజ్యాంగం కల్పించిన ఈ హక్కులు ప్రతి గ్రామంలో, ప్రతి పల్లెలో ఆచరణలో ఉన్నాయా? అట్టడుగు వర్గాల ప్రజలు గౌరవంగా జీవించగలుగుతున్నారా? ప్రభుత్వ పథకాలు, ప్రజా సదుపాయాలు వారికి సమానంగా అందుతున్నాయా? అనే అంశాలను పరిశీలించి, ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు పౌర హక్కుల దినోత్సవం ఒక ముఖ్యమైన వేదిక. అయితే ఈ కార్యక్రమం ఆశించిన లక్ష్యాన్ని సాధిస్తోందా? నెలకోసారి సమావేశం నిర్వహించడం, అధికారులు హాజరుకావడం, సమస్యలను నమోదు చేయడం, ఫొటోలు తీసుకోవడంతోనే కార్యక్రమం ముగుస్తోందా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

భారత రాజ్యాంగంలోని 14వ అధికరణం సమానత్వపు హక్కును, 15వ అధికరణం వివక్ష నిషేధాన్ని, 17వ అధికరణం అంటరానితనం నిర్మూలనను నిర్దేశిస్తున్నాయి. వీటికి అనుగుణంగా పౌర హక్కుల పరిరక్షణ చట్టం1955, ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం1989 అమల్లో ఉన్నాయి. ఆయా చట్టాల్లో పేర్కొన్న నిబంధనలకు అనుగుణంగా వివక్ష, అంటరానితనం, నేరపూరిత చర్యలకు సంబంధించిన ఫిర్యాదులపై సంబంధిత అధికారులు చట్టప్రకారం స్పందించాల్సి ఉంటుంది. అయితే చట్టాలు ఉన్నంత మాత్రాన సమస్యలు వాటంతట అవే పరిష్కారం కావు. ప్రజలకు వాటిపై అవగాహన కల్పించడం, బాధితులు ఫిర్యాదు చేసేందుకు అనుకూల వాతావరణం కల్పించడం, ఫిర్యాదుల స్వభావాన్ని బట్టి చట్టబద్ధమైన చర్యలు తీసుకోవడం కీలకం.

తెలంగాణలో ప్రతి నెల 30వ తేదీన పౌర హక్కుల దినోత్సవం నిర్వహించే విధానం అమల్లో ఉంది. ఈ కార్యక్రమం కేవలం ఒక తేదీకి, సమావేశానికి పరిమితం కాకుండా గ్రామాల్లో సామాజిక పరిస్థితులపై అవగాహన పెంచే ప్రక్రియగా కొనసాగాలి. ప్రజలకు తమ హక్కులు, చట్టపరమైన రక్షణలు, ఫిర్యాదు చేసే విధానాలపై వివరించాలి.



క్షేత్రస్థాయి పరిస్థితులపై దృష్టి ఏది?

పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా గ్రామాల్లో సమావేశాలు నిర్వహించినప్పుడు అధికారులు ప్రజల సమస్యలను వినడంతో పాటు, అవసరమైన సందర్భాల్లో క్షేత్రస్థాయి పరిస్థితులను కూడా పరిశీలించాలి. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో నివసిస్తున్న ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడం ఉపయోగకరంగా ఉంటుంది. తాగునీటి వనరులు, రహదారులు, శ్మశానవాటికలు, ఆలయాలు, ఇతర ప్రజా ప్రదేశాల వినియోగంలో సమాన అవకాశాలు ఉన్నాయా? ఎక్కడైనా వివక్ష లేదా అడ్డంకులపై ఫిర్యాదులు ఉన్నాయా? అనే అంశాలను పరిశీలించాలి. మహిళలు, యువత, వృద్ధులు సహా వివిధ వర్గాల ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవాలి.

ప్రతి నెల నిర్వహించే ప్రతి సమావేశంలో అధికారులు తప్పనిసరిగా ఎస్సీ, ఎస్టీ కాలనీలను సందర్శించాలనే నిర్దిష్ట నిబంధన ఉందని సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వు ఆధారం లేకుండా చెప్పడం సరికాదు. అయితే పౌర హక్కుల పరిరక్షణ లక్ష్యాన్ని సమర్థంగా అమలు చేయాలంటే క్షేత్రస్థాయి పరిశీలన, ప్రజలతో ప్రత్యక్ష సంభాషణ, సమస్యల గుర్తింపు వంటి చర్యలు అవసరం. ఇవి కేవలం లాంఛనంగా కాకుండా బాధ్యతాయుతమైన పరిపాలనా విధానంలో భాగంగా ఉండాలి.ఎక్కడైనా కులవివక్ష, అంటరానితనం, సామాజిక బహిష్కరణ లేదా ప్రజా సదుపాయాల వినియోగంలో అడ్డంకులపై ఫిర్యాదులు వస్తే వాటిని నిర్లక్ష్యం చేయకూడదు. ఫిర్యాదులోని అంశాలను పరిశీలించి, వర్తించే చట్టాల ప్రకారం సంబంధిత అధికార యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లాలి. చట్ట పరిధిలోకి వచ్చే నేరానికి సంబంధించిన సమాచారం అందినప్పుడు, సంబంధిత చట్టం నిర్దేశించిన విధంగా పోలీసు, ఇతర అధికార యంత్రాంగం స్పందించాలి. రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి మౌలిక సదుపాయాల సమస్యలను సంబంధిత శాఖలకు నివేదించి పరిష్కారానికి చర్యలు తీసుకునేలా సమన్వయం చేయాలి.

సమావేశాలు జరిగాయి.. ప్రజల్లో అవగాహన ఎంత?

ప్రతి నెలా పౌర హక్కుల దినోత్సవం నిర్వహిస్తున్న నేపథ్యంలో ఇప్పటివరకు జరిగిన సమావేశాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఎంతవరకు చట్టపరమైన అవగాహన కలిగిందన్నది సమీక్షించాల్సిన అంశం. ఎన్ని గ్రామాల్లో కార్యక్రమాలు జరిగాయి? ఎంతమంది ప్రజలు పాల్గొన్నారు? చట్టాల్లోని నిబంధనలు, ఫిర్యాదు చేసే విధానాలపై ఎంతమందికి వివరించారు? సమావేశాల్లో వచ్చిన ఫిర్యాదులపై సంబంధిత శాఖలు తీసుకున్న చర్యలేమిటి? అనే అంశాలపై అధికారిక రికార్డుల ఆధారంగా సమీక్ష జరగాల్సిన అవసరం ఉంది.ప్రభుత్వం నిర్వహించే అవగాహన కార్యక్రమాల ప్రభావాన్ని అంచనా వేయడం, వాటి ద్వారా సాధించిన ఫలితాలను పరిశీలించడం సమర్థవంతమైన పరిపాలనలో భాగం. అందుబాటులో ఉన్న సమావేశాల వివరాలు, హాజరు పట్టికలు, అవగాహన కార్యక్రమాల నివేదికలు, అందిన ఫిర్యాదులు, వాటిపై తీసుకున్న చర్యల వివరాలను పరిశీలిస్తే కార్యక్రమాల అమలు తీరు స్పష్టమవుతుంది. ప్రజల్లో అవగాహన పెరిగిందని లేదా పెరగలేదని గణాంకాలు, క్షేత్రస్థాయి సమాచారం లేకుండా నిర్ధారించడం సరికాదు. అందుకే ఇప్పటివరకు జరిగిన కార్యక్రమాలపై సంబంధిత అధికారులు వాస్తవ వివరాలను వెల్లడించాలి. సమావేశాల నిర్వహణే లక్ష్యమా? లేక ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించి, హక్కుల పరిరక్షణకు ఉపయోగపడే ఫలితాలు సాధించడమా? అన్నది సమీక్షించాల్సిన సమయం ఆసన్నమైంది.

సమస్యల నమోదు కాదు.. పరిష్కారంపై సమీక్ష కావాలి

సమావేశంలో ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి? వాటిలో ఎన్ని పరిష్కారమయ్యాయి? ఎన్ని పరిశీలనలో ఉన్నాయి? ఏ శాఖకు ఏ సమస్యను నివేదించారు? వాటిపై తీసుకున్న చర్యలేమిటి? అనే వివరాలను సమీక్షించడం అవసరం. గత సమావేశంలో ప్రస్తావించిన సమస్యలపై పురోగతి ఏమిటో కూడా తెలుసుకోవాలి. కేవలం హాజరు పట్టికలు, ఫొటోలు, నివేదికలతో కార్యక్రమం పూర్తయినట్లు భావిస్తే ఆశించిన ఫలితం దక్కదు. సమస్యను నమోదు చేయడం ఒక దశ మాత్రమే. దాని స్వభావాన్ని బట్టి సంబంధిత శాఖ ద్వారా పరిష్కారానికి చర్యలు జరిగేలా చూడటం ముఖ్యం.పౌర హక్కుల దినోత్సవం నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం లేదా సంబంధిత శాఖ జారీ చేసిన మార్గదర్శకాలు, ఉత్తర్వులు ఏవైనా ఉంటే వాటిని పాటించాలి. సమావేశాల సమాచారం ప్రజలకు ముందుగానే చేరేలా చూడాలి. బాధితులు ఎలాంటి భయం, ఒత్తిడి లేకుండా తమ సమస్యలను వెల్లడించగల వాతావరణం కల్పించాలి. ఫిర్యాదు చేసిన వ్యక్తుల గోప్యతకు భంగం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఫిర్యాదులపై నిర్ణయం తీసుకునే సమయంలో వాస్తవాలు, అందుబాటులో ఉన్న ఆధారాలు, వర్తించే చట్ట నిబంధనలను పరిగణనలోకి తీసుకోవాలి.

ప్రజలకు అవగాహన.. హక్కులపై చైతన్యం

పౌర హక్కుల దినోత్సవం అధికారుల కార్యక్రమం మాత్రమే కాదు. ప్రజలకు తమ హక్కులను తెలుసుకునే అవకాశమూ. వివక్ష ఎదురైతే ఎవరిని సంప్రదించాలి? ఎక్కడ ఫిర్యాదు చేయాలి? ఏ చట్టం కింద రక్షణ పొందవచ్చు? బాధితులకు అందుబాటులో ఉన్న సహాయ వ్యవస్థలు ఏమిటి? అనే విషయాలను వివరించాలి. అవగాహన లేకనో, భయంతోనో అన్యాయాన్ని మౌనంగా భరించాల్సిన పరిస్థితి రాకుండా చూడాలి. అదే సమయంలో వచ్చిన ప్రతి ఆరోపణను ముందుగానే నిర్ధారిత నేరంగా పరిగణించకుండా, నిష్పక్షపాతంగా పరిశీలించి చట్టప్రకారం తదుపరి చర్యలు చేపట్టాలి.పౌర హక్కుల దినోత్సవం ఒక ఆచారంగా మిగిలిపోకూడదు. రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రజల్లో అవగాహన పెంచడం, వివక్షకు సంబంధించిన సమస్యలను గుర్తించడం, బాధితులకు అందుబాటులో ఉన్న చట్టపరమైన మార్గాలను తెలియజేయడం, సంబంధిత అధికార యంత్రాంగం ద్వారా పరిష్కారానికి కృషి చేయడం ఈ కార్యక్రమానికి అసలైన స్ఫూర్తి. హక్కులు ఎవరో దయతో ఇచ్చేవి కావు. రాజ్యాంగం కల్పించినవి. వాటికి భంగం కలిగినప్పుడు చట్టబద్ధంగా ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికీ ఉంది.

హాజరు కోసం కాదు.హక్కుల పరిరక్షణ కోసం. ఫొటోల కోసం కాదు.సమస్యల పరిష్కారం కోసం. నివేదికల కోసం కాదు. వివక్షలేని సమాజ నిర్మాణం కోసం పౌర హక్కుల దినోత్సవం జరగాలి.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

సర్వే సమయంలో ఊరెళ్లిన వారి ఓట్ల రద్దు!
- డిక్లరేషన్ ఫారంపై సంతకం లేదంటూ లక్షల అర్జీలపై వేటు

హైదరాబాద్ :తల్లి మరణించడంతో ఊరికెళ్లిన ఓ కుటుంబంలో 10 ఓట్లు రద్దయ్యాయి. వివాహ వేడుక కోసం బంధువుల గ్రామానికెళ్లిన మరో కుటుంబంలోని అందరి పేర్లను ఓటర్ల జాబితా నుంచి పూర్తిగా తొలగించారు. హైదరాబాద్?లో ఎస్?ఐఆర్? ప్రక్రియలో భాగంగా నిర్ణీత గడువులోపు ఎన్యూమరేషన్ పత్రాలను సమర్పించలేక ఇలా ఓటు హక్కు కోల్పోయిన బాధితులు కోకొల్లలుగా దర్శనమిస్తున్నారు.ఈ లోపాలను సరిదిద్దడం కోసం అధికారులు తిరిగి ఓటర్లుగా నమోదు చేసేందుకు ప్రయత్నిస్తున్నా, డిక్లరేషన్ ఫారానికి సంబంధించిన సమస్యల కారణంగా ఆ ప్రయత్నాలూ ఫలించడం లేదు. 'నేను మొదటిసారి ఓటరుగా నమోదు చేసుకుంటున్నాను' అని డిక్లరేషన్? ఫారంపై సంతకం పెడితే, చట్టప్రకారం తప్పుచేసినట్లే అవుతుందని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో వేలాది ఓటు నమోదు దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నా యి.పలువురు ఓటర్ల తొలగింపు కథనాలివీభోలక్‌పూర్‌లో నివసించే సాయిబాబా కుటుంబంలో ఎస్ఐఆర్?కు ముందు 11 మంది ఓటర్లు ఉండేవి. అయితే ఓటరు సర్వే తర్వాత ఒక్కరి పేరు మాత్రమే జాబితాలో మిగిలింది. అధికారులు ఇచ్చిన ఎన్యూమరేషన్? పత్రాల్లో వివరాలు రాసి, తిరిగి సమర్పించే సమయానికి సాయిబాబా తల్లి మరణించారు. దీంతో అతని కుటుంబమంతా నగరం నుంచి సిద్దిపేటకు వెళ్లాల్సి వచ్చింది. తిరిగొచ్చేసరికి ఎన్యూమరేషన్ పత్రాలను స్వీకరించే గడువు ముగిసింది. దీంతో ముసాయిదా ఓటర్ల జాబితాలో అతని కుటుంబంలోని ఓట్లన్నీ రద్దయ్యాయి.పాత రామంతాపూర్‌కు చెందిన రాజు, అతని భార్య



ఓటర్ సర్వే జరిగే సమయంలో వ్యక్తిగత కారణాలతో తమ సొంతూరికి వెళ్లారు. తిరిగొచ్చిన తర్వాత ఎన్యూమరేషన్ పత్రాలను ఇచ్చేందుకు వెళ్లగా, గడువు ముగిసిందన్నారు. దీంతో వారిద్దరి ఓట్లు రద్దయ్యాయి.మలక్‌పేటలో నివసించే ఓ ప్రభుత్వ ఉద్యోగి కుటుంబంలో 10 ఓట్లుండగా, పలు కారణాల వల్ల ఎన్యూమరేషన్ పత్రాలు తిరిగివ్వడానికి ఆలస్యమైంది. దీంతో అందరి ఓట్లు రద్దయ్యాయి."నా వయస్సు 70 ఏళ్లు. ఎన్టీఆర్ పార్టీని స్థాపించినప్పటి నుంచి నేను ఓటు వేస్తూనే ఉన్నాను. సర్వే సమయంలో నా ఓటు రద్దయింది. దాన్ని పునరుద్ధరించుకోవ డానికి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాను. ఆధార్ కార్డును కూడా సాక్ష్యంగా అంగీకరించడం లేదు. ఇన్నాళ్లూ ఓటు వేసిన నేను, ఇంకా బతికే ఉన్నా చనిపోయిన వ్యక్తిగా పరిగణిస్తున్నట్లు ఉంది" - షేక్ మహబూబ్, భోలక్‌పూర్‌మేం తప్పు దు ద్రువీకరణ ఎందుకివ్వాలి?ఓటరు నమోదు కోసం ఫారం-6లో దరఖాస్తుదారులు తమ వివరాలు నింపి, ఫొటోను జత చేసి, చివరలో సంతకం చేయాల్సి ఉంటుంది. ఈ ఫారంతో పాటు మరో పత్రంపైనా సంతకం చేయాల్సి ఉంటుంది. ఇందులో తల్లిదండ్రులు లేదా తాత, అమ్మమ్మల ఓట్ల వివరాలు నమోదు చేయాలి. లేదంటే ఎన్నికల సంఘం నిర్దేశించిన 12 రకాల గుర్తింపు పత్రాల్లో ఏదో ఒకటి జత చేయాలి. వీటితో పాటు "నేను తొలిసారి ఓటరుగా నమోదు చేసుకుంటున్నాను" అని పేర్కొంటూ చివర్లో డిక్లరేషన్? ఫారంపై సంతకం పెట్టాలి.ఎన్యూమరేషన్? పత్రాలు తిరిగివ్వకపోవ డం, తల్లిదండ్రులు లేదా పూర్వీకుల ఓట్లతో మ్యాపింగ్ చేసుకోకపోవడం లేదా బీఎల్వోల నిర్లక్ష్యం వంటి కారణాలతో ఓటు హక్కు కోల్పోయిన బాధితులు డిక్లరేషన్ ఫారంపై సంతకం చేయడానికి అభ్యంతరం తెలుపుతున్నారు. తమ ఓట్లు రద్దు చేస్తే, తిరిగి నమోదు చేసుకోవడానికి తామెందుకు తప్పుడు ధ్రువీకరణ ఇవ్వాలని ప్రశ్నిస్తున్నారు. ఎస్?ఐఆర్?కు ?ముందు హైదరాబాద్? మహానగర ఓటరు జాబితాలో 1,14,15,542 ఓటర్లుండగా, ముసాయిదా జాబితాలో ఆ సంఖ్య 71,15,441గా నమోదైంది.

సూర్యాపేటలో 150 కిలోల గంజాయి పట్టివేత.. ఇద్దరి అరెస్ట్



సూర్యాపేట, నవంబర్ 1: జిల్లాలో భారీ మొత్తంలో గంజాయి లభ్యమవడం కలకలం రేపింది. 150 కిలోల గంజాయిని తరలిస్తున్న యువకులను కోదాడ పోలీసులు అరెస్ట్ చేశారు. కాగా.. ఈ కేసుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి మీడియా సమావేశంలో వెల్లడించారు.సూర్యాపేట జిల్లాలో భారీ మొత్తంలో గంజాయి తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు.. జిల్లావ్యాప్తంగా తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో 150 కేజీల గంజాయిని తరలిస్తున్న ఐదుగురు యువకుల ముఠాపై పోలీసులు దాడి చేశారు. కాగా.. ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేయగా.. మరో ముగ్గురు పరారయ్యారు. ఈ మేరకు నిందితుల నుంచి 150 కిలోల గంజాయి, రెండు ఫోన్లు, ఓ కారును స్వాధీనం చేసున్నారు. రాజమండ్రి నుంచి బెంగుళూరుకు గంజాయిను తరలిస్తున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. కాగా.. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలిస్తున్నట్లు వెల్లడించారు. ఈ దందాతో ఎవరెవరికి సంబంధం ఉంది. ఇంత పెద్ద మొత్తంలో గంజాయి వీరికి ఎలా లభించింది అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన బీఆర్ఎస్ ఆస్ట్రేలియా బృందం



హైదరాబాద్ :బీఆర్ఎస్ ఆస్ట్రేలియా బృందం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆ ర్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆస్ట్రేలియా బృందం సభ్యుడు వంశీ సాధు కుటుంబంలో జరగనున్న వివాహ వేడుకకు హాజరు కావాలని కేటీఆర్‌ను ఆహ్వానించారు. ఆస్ట్రేలియాలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి, తెలంగాణ సమాజ అభ్యున్నతికి బీఆర్ఎస్ ఆస్ట్రేలియా చేస్తున్న కృషిని కేటీఆర్ అభినందించారు. విదేశాల్లో ఉంటూ పార్టీ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు చేస్తున్న కృషిని ప్రశంసించారు.తమ నాయకుడు కేటీఆర్ ఆస్ట్రేలియా బీఆర్ఎస్ బృందం చేస్తున్న సేవలను అభినందించడం ఎంతో సంతోషంగా, ప్రోత్సాహకరంగా ఉందని బీఆర్ఎస్ ఆస్ట్రేలియా వ్యవస్థాపక అధ్యక్షుడు కాసర్ల నాగేందర్ రెడ్డి తెలిపారు. భవిష్య త్తులోనూ పార్టీ అభివృద్ధికి, తెలంగాణ సమాజ సేవకు మరింత అంకితభావంతో కృషి చేస్తామని పేర్కొన్నారు. కేటీఆర్‌ను వంశీ సాధు , దీక్షిత ,తమ కుటుంబ సభ్యులతో కలిశారు.

ఈసీకి సుప్రీంకోర్టు నోటీసులు- ఫారం 6లో మార్పు పిటిషన్లపై విచారణ

న్యూ ఢిల్లీ ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై ఎన్నికల సంఘం దాఖలు చేసిన అఫిడవిట్‌కు సమాధానం ఇచ్చేందుకు పిటిషనర్లకు సుప్రీంకోర్టు 10 రోజుల గడువు ఇచ్చింది. ఎస్ఐఆర్ చట్ట నిబంధనలకు అనుగుణంగానే చేపట్టామని, ఈ ప్రక్రియకు సంబంధించిన నిర్ణయాలను ఎన్నికల సంఘంలోని ముగ్గురు సభ్యులూ ఏకగ్రీవంగా ఆమోదించారని ఈసీ తన అఫిడవిట్‌లో పేర్కొంది. మరోవైపు, బిహార్‌లో ఎస్ఐఆర్ సందర్భంగా ఓటరు నమోదు కోసం ఉపయోగించే ఫారం-6లో సుప్రీంకోర్టు అనుమతి లేకుండానే మార్పులు చేశారన్న ఆరోపణలపై దాఖలైన తాజా పిటిషన్‌పైనా ధర్మాసనం నోటీసులు జారీ చేసింది.ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వీ మోహనతో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ ఆదేశాలు ఇచ్చింది. ఎన్నికల సంఘం సోమవారం రాత్రి దాఖలు చేసిన అఫిడవిట్‌పై పది రోజుల్లోగా ప్రత్యుత్తర అఫిడవిట్ సమర్పించాలని తొలి పిటిషనర్ రాకేశ్ కుమార్ సింగ్ తరఫున వాదిస్తున్న సీనియర్ న్యాయవాది వికాస్



సింగ్‌ను ఆదేశించింది. ఈ వ్యవహారానికి సంబంధించిన అన్ని అంశాలను పరిశీలిస్తామని ప్రధాన న్యాయమూర్తి స్పష్టం చేశారు. రాజ్యసభ సభ్యురాలు దోలా సేన్ దాఖలు చేసిన మరో పిటిషన్‌పై ఎన్నికల సంఘం, ఇతర సంబంధిత పక్షాలకు కూడా ధర్మాసనం నోటీసులు జారీ చేసింది.ఫారం-6లో మార్పులపై వివాదంబిహార్ ఎస్ఐఆర్ ప్రక్రియలో ఫారం-6లో మార్పులు చేశారంటూ దోలా సేన్ తన పిటిషన్‌లో ఆరోపించారు. ఆమె తరఫున సీనియర్ న్యాయవాది, ఎంపీ మేనకా గురుస్వామి వాదనలు వినిపించారు. ఫారం-6లో చేసిన మార్పులకు సుప్రీంకోర్టు ఆమోదం ఉందని ఎన్నికల సంఘం తప్పుగా పేర్కొంటోందని ఆమె కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఆరోపణలను ఎన్నికల సంఘం తోసిపుచ్చింది. ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు ఉపయోగించే చట్టబద్ధమైన ఫారం-6లో ఎలాంటి మార్పులూ చేయలేదని తన 248 పేజీల అఫిడవిట్‌లో స్పష్టం చేసింది. ఎన్నికల సంఘం ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఆరోపణలు చేయడం విచారకరమని పేర్కొంది.ఎస్ఐఆర్‌కు చట్టబద్ధత ఉందన్న ఈసీప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌తో పాటు ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై ఈసీ తన వైఖరిని వెల్లడించింది. ఎస్ఐఆర్ నిర్వహణకు చట్టపరమైన అధికారం ఉందని, సంబంధిత ఉత్తర్వులకు ఎన్నికల సంఘంలోని ముగ్గురు సభ్యులూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారని అఫిడవిట్‌లో పేర్కొంది. ఈ అఫిడవిట్‌ను కోర్టులో దాఖలు చేయడానికి కూడా ముగ్గురు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపినట్లు ఎన్నికల సంఘం తెలిపింది. ఉప ఎన్నికల కమిషనర్ భాను ప్రకాశ్ యేతురు తరఫున ఈ సమాధానాన్ని దాఖలు చేశారు.

గ్రామాలకు విస్తరించిన రియల్ దందా
సాగు భూముల్లో వెలుస్తున్న ప్లాట్లు

హైదరాబాద్ :పట్టణాల్లో పెరుగుతున్న జనాభా అవసరాలకు తగిన వసతుల కల్పన కష్టసాధ్యమవుతోంది. దీంతోపాటు పట్టణాల విస్తీర్ణం పెరుగుతుండటంతో వాటి సమీపంలోని గ్రామాల్లో భూముల ధరలకు రెక్కలొస్తున్నాయి. దీన్ని ఆసరాగా పలువురు ముందస్తుగా తక్కువ ధరకు స్థలాలను కొనుగోలు చేసి విక్రయిస్తున్నారు. అయితే కొనుగోలు చేస్తున్న వాటిల్లో ఎక్కువగా సాగు భూములే ఉండటంతో పలు ఇబ్బందులు ఎదురవుతు న్నాయి. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వాటిని ప్లాట్లుగా విభజించి విక్రయాలు జరుపుతున్నారు. వాటిని కొనుగోలు చేసిన వారికి భవిష్యత్తులో చిక్కులు ఎదురయ్యే అవకాశముంది.సాగు భూముల్లో వెలుస్తున్న ప్లాట్లుకాగజ్‌నగర్ మండలంలోని వల్లకొండ పంచాయతీ నామానగర్ సమీపంలో వ్యవసాయ భూమిని మూడేళ్ల కిందట కౌటాల మండలానికి చెందిన ఓ నాయకుడు



కొనుగోలు చేశారు. ఆ భూమిని ఇటీవలే ప్లాట్లుగా విభజించి సిమెంట్ పోల్స్?తో హద్దులను ఏర్పాటు చేశారు. ఆ ప్లాట్లను కొనుగోలు చేసిన ఒకరిద్దరు ఇంటి నిర్మాణాలకు ఇటుక కూడా తెచ్చుకున్నారు. కాగజ్‌నగర్-పెంచికల్‌పేట్ మెయిన్‌రోడ్ పక్కనే ఉండటంతో ఇక్కడ ఫుల్ డిమాండ్ ఉంది. ఈ ప్రాంతంలో గుంట విస్తీర్ణానికి రూ.2 లక్షల ధర పలుకుతోంది. నిబంధనలు యథేచ్ఛగా తుంగలోతొక్కి ప్లాట్ల దందా కొనసాగిస్తున్నప్పటికీ రాజకీయనాయకుల అండదండలతో చర్యలకు రెవెన్యూ అధికారులు సాహసించలేక పోతున్నారు.యాజమాన్య బదిలీ కాదని తెలిసినాకాగజ్‌నగర్ మండలంలోని ఉమ్మడి నజ్రుల్‌నగర్ పంచాయతీ గ్రామాల్లోని బెంగాలీలకు పునరావాసం కింద రాష్ట్ర ప్రభుత్వం సాగు భూములను సమకూర్చింది.తక్కువ ధరకు కొనుగోలు చేసి, కొంత మంది స్థిరాస్తి దందాను కొనసాగిస్తున్నారు. అయితే ఈ భూములకు పట్టా ట్రాన్స్ఫర్ కాదని తెలిసి కూడా ఇంటి నిర్మాణాలకు ఏమి కాదనే ధీమాలో పలువురు కొనుగోలు చేస్తున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం చేతగానితనం వల్లే రైతాంగానికి తీరని నష్టం

మహబూబ్ నగర్ : ఎల్ నినో పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం తప్పించుకునే ప్రయత్నం చేస్తుందని మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి ఆరోపించారు. జిల్లాలోని నవాబ్ పేట మండలం అమ్మాపూర్ గ్రామంలో మాజీ ఎంపీ మన్నే శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఎండిన పంటలను పరిశీలించి, రైతులను పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు సంవత్సరాలు కరువు



వచ్చినా తట్టుకునే విధంగా కేసీఆర్ ప్రభుత్వం ప్రాజెక్టులను డిజైన్ చేసిందని వెల్లడించారు. ఇందులో భాగంగా కాళేశ్వరాన్ని నిర్మించి లక్షలాధి ఎకరాలకు నీరందించారని గుర్తు చేశారు. పంటలు వేసుకున్న రైతులకు నీరందించక, కరెంటు ఇవ్వక కాంగ్రెస్ తీరని నష్టం చేస్తుందని విమర్శించారు. ఎండిన పంటలకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ పూర్తి చేయకపోవడం వల్లే ఈ ప్రాంత రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నవాబ్ పేట లో పండల ఎకరాలు ఎండిపోతే కరువు మండలంగా ప్రకటించలేదని విమర్శించారు. నవాబ్ పేట, మిడ్జిల్ మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని కోరారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

యాదాద్రి జిల్లాలో దారుణం..
కిలో బంగారం కోసం వ్యక్తి హత్య..

యాదాద్రి భువనగిరి, నవంబర్ 1:



జిల్లాలో దారుణ హత్య ఘటన తీవ్ర కలకలం రేపింది. చౌటుప్పల్ మున్సి పాలిటీ పరిధిలోని మార్కండేయ నగర్ కాలనీలో జోగిని రాళ్లబండి సుధాకర్ (48)ను గుర్తుతెలియని దుండగులు అత్యంత కిరాతకంగా హత్య చేశారు. సుధాకర్ స్వామిని కాళ్లు, చేతులు కట్టేసి హతమార్చిన నిందితులు.. అనంతరం ఆయన వద్ద ఉన్న భారీ మొత్తంలో బంగారు, వెండి ఆభరణాలను దోచుకుని పరారయ్యారు. సుమారు కిలో బంగారం, అర కిలో వెండి ఆభరణాలను అపహరించడంతో పాటు, మృతుడికి చెందిన కారును సైతం తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర భయాందోళనలకు దారితీయడంతో పాటు జిల్లావ్యాప్తంగా సంచలనంగా మారింది.హత్య అనంతరం స్వామి కారుతో పరారైన నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. అస్సాంకు చెందిన దుండగులుగా గుర్తించిన పోలీసులు.. వారు కారులో వెళ్తున్న క్రమంలో సిద్దిపేట సమీపంలో అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మరోవైపు హత్య జరిగిన విషయం తెలుసుకున్న ఎస్పీ అక్షాంష్ యాదవ్ సంఘటన స్థలాన్ని పరిశీలించి ఘటనకు సంబంధించిన వివరాలను పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. హత్యకు గల అసలు కారణాలు ఏమిటి? నిందితులు సుధాకర్‌ను ఎందుకు లక్ష్యంగా చేసుకున్నారు? దోపిడీ కోసమే ఈ ఘాతుకానికి పాల్పడ్డారా? లేక మరేదైనా కారణం ఉందా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టే అవకాశం ఉంది. భారీ మొత్తంలో ఆభరణాల అపహరణ, మృతుడిని కాళ్లు చేతులు కట్టేసి హతమార్చిన తీరు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.

సన్నబియ్యం ధరలకు కళ్లెం..

హైదరాబాద్:
తెలంగాణలో సన్న బియ్యం ధరల నియంత్రణకు చర్యలు రకాలను బట్టి గరిష్ఠ చిల్లర ధరలను ఖరారు చేసిన ప్రభుత్వం
నిర్ణీత ధరల కంటే ఎక్కువకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక కూకట్‌పల్లిలో తనిఖీలు, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులుప్రతి దుకాణంలోనూ ధరల పట్టిక తప్పనిసరి తెలంగాణలో సన్న బియ్యం ధరల పెరుగుదలకు రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకట్ట వేసింది. మిల్లర్లు, వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి, అక్రమ నిల్వల ద్వారా ధరలను పెంచుతున్నారన్న ఆరోపణల నేపథ్యంలో పౌరసరఫరాల శాఖ రంగంలోకి దిగింది. వినియోగదారులపై అదనపు భారం పడకుండా వివిధ రకాల సన్న బియ్యంపై గరిష్ఠ చిల్లర ధరలను



ఖరారు చేస్తూ నిర్ణయం తీసుకుంది.శనివారం మిల్లర్లు, వ్యాపారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ ధరలను ఖరారు చేశారు. తాజా నిర్ణయం ప్రకారం.. బీపీటీ, కేఎన్ఎం రకం బియ్యం కిలోకు గరిష్ఠంగా రూ.66, తెలంగాణ సోనా, ఆర్ఎన్ఆర్ రకం రూ.74, అలాగే హెచ్ఎంటీ, జేఎస్ఆర్ రకాలను రూ.79 మించి విక్రయించకూడదు. ప్రభుత్వం నిర్ణయించిన ఈ ధరల పట్టికను ప్రతి దుకాణంలోనూ వినియోగదారులకు కనిపించేలా తప్పనిసరిగా ప్రదర్శించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.ఇటీవల మార్కెట్‌లో నాణ్యమైన సన్నబియ్యం కిలో రూ.75 నుంచి రూ.95 వరకు విక్రయిస్తున్న నేపథ్యంలో, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో తూకంలో తేడాలు, ఎంఆర్‌పీ స్టిక్కర్ల ట్యాంపరింగ్ వంటి ఉల్లంఘనలపై ఆరు కేసులు నమోదు చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఐపీసీ సెక్షన్ 420తో పాటు నిత్యావసర వస్తువుల చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

దారువుతో చేసిన సూర్య దేవాలయం- ఒక్కసారి దర్శిస్తే సమస్త రోగాలు మటుమాయం!

ప్రత్యక్ష దైవం, ఆరోగ్య ప్రదాత అయిన సూర్య భగవానునికి దేశవ్యాప్తంగా అనేక చోట్ల ఆలయాలున్నాయి. ప్రధానంగా ఒక్క కాశీ పట్టణంలోనే ద్వాదశ ఆదిత్యుల ఆలయాలు వెలసి ఉన్నాయి. ఇక ఆంధ్రప్రదేశ్?లోని అరసవిల్లిలో, ఒడిషాలోని కోణార్క్?లో సూర్య దేవాలయాలు ప్రపంచ ప్రసిద్ధి చెందినవి. ఇదే ఒడిశాలో రెండో కోణార్కగా విరాజిల్లుతున్న మరో సూర్య దేవాలయం గురించిన విశేషాలు తెలుసుకుందాం.



అందమైన చిత్రకళా శిల్పాలు, నగిషీలు రథాన్ని నడుపుతున్నట్లుగా చెక్కి ఉంది. భక్తులను మంత్రముగ్ధులను చేస్తాయి.

దారు సూర్య దేవాలయం

ప్రత్యక్ష భగవానుడైన సూర్య భగవానుని లేలేత కిరణాలు ప్రసరించే ఆలయాల్లో అరసవిల్లి, కోణార్క ప్రసిద్ధి చెందినవి. ఇదే కోవలోకి చెందినదే మరో ఆలయం ఒడిశాలోనే వెలసి ఉంది. 'దారు సూర్య దేవాలయం' అంటే చెక్కతో తయారైన సూర్య దేవాలయంగా ప్రసిద్ధి చెందిన ఆ ఆలయ విశేషాలు ఇప్పుడు చూద్దాం.

దారు సూర్య దేవాలయం ఎక్కడుంది?

ఒడిశాలో ప్రసిద్ధ సూర్య దేవాలయం ఉన్న కోణార్క్ నుంచి సుమారు 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న గంజాంలోని గుడుంబా పట్టణంలో దారు సూర్య దేవాలయం వెలసి ఉంది. కోణార్క్ దేవాలయ నిర్మాణ శైలికి కాస్త భిన్నంగా దర్శనమిచ్చే ఈ ఆలయ పైకప్పు పూర్తిగా చెక్కతో నిర్మించడం విశేషం.

ఆలయ చారిత్రక నేపథ్యం

పూర్వం రుషులచే నిర్మించిన ఈ ఆలయాన్ని క్రీ.శ. 1790 ప్రాంతంలో ఘుమ్సర్ రాజ్యానికి చెందిన రాజు శ్రీకర భంజదేవ పునర్నిర్మించారని ఆలయ చరిత్ర ద్వారా తెలుస్తోంది.

దారు కోణార్క్ అని ఎందుకు అంటారు?

ప్రాచీన కోణార్క్ ఆలయం పూర్తిగా రాతితో నిర్మితమైతే, బుగూడలోని ఈ ఆలయం దాని విశిష్టమైన చెక్క శిల్పకళకు ప్రపంచ ప్రసిద్ధి చెందింది. కాబట్టి ఈ ఆలయాన్ని దారు కోణార్క్ అంటారు.

ఆకట్టుకునే నిర్మాణ శైలి!

ఈ ఆలయం మొత్తాన్ని 46 స్తంభాలతో నిర్మించడం విశేషం. పూర్తిగా చెక్కతో తయారైన ఆలయ పైకప్పుపై చెక్కిన అత్యంత సూక్ష్మమైన, ఆకట్టుకునే కుడ్యచిత్రాలు ఆలయ గోడలపై రామాయణం, మహాభారతం, కృష్ణ లీలలు, విష్ణుమూర్తి దశావతారాలకు సంబంధించిన అద్భుతమైన సాంప్రదాయ ఒడిశా శైలి వర్ణచిత్రాలు చిత్రించి ఉన్నాయి.

సూర్యాస్తమయ కిరణాలు ప్రసరించే ఏకైక దేవాలయం

సాధారణంగా సూర్య దేవాలయాలు ఉదయించే సూర్యుడిని ఆహ్వానిస్తూ తూర్పు ముఖంగా వెలసి ఉండడం చూస్తుంటాం కానీ దారు కోణార్క్ సూర్య దేవాలయం మాత్రం పడమర ముఖంగా ఉంటుంది. అందువల్ల, సాయంత్రం వేళ అస్తమించే సూర్యుని తొలి కిరణాలు నేరుగా గర్భగుడిలోని స్వామి వారి పాదాలపై పడతాయి.త్రిమూర్తుల స్వరూపం బిరంచి నారాయణ స్వామిఈ క్షేత్రంలో గర్భాలయంలో కొలువైన సూర్యభగవానుడు బిరంచి నారాయణ స్వామిగా పూజలందుకోవడం విశేషం. ఈ విగ్రహం మాల్తీగడ కోట శిథిలాల నుంచి లభ్యమైనట్లుగా ఆలయ చరిత్ర ద్వారా తెలుస్తోంది. ఈ విగ్రహం త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల అంశలతో వెలసిన సూర్యుని స్వరూపం కావడం విశేషం.

రథం ఆకృతిలో నిర్మాణం

దారు కోణార్క్ ఆలయం కూడా కోణార్క్ సూర్య దేవాలయం మాదిరిగానే సూర్యభగవానుని రథం ఆకారంలో నిర్మించి ఉండడం విశేషం. ఈ రథానికి ఏడు గుర్రాలు, ఎడమ వైపున ఒక చక్రం ఉండగా, సూర్యుని రథసారథి అయిన

ప్రధాన పండుగలు

దారు కోణార్క్ సూర్య దేవాలయంలో ప్రతిరోజూ నిత్యపూజలు ఒడిశా సాంప్రదాయ రీతిలో జరుగుతాయి. ప్రతి ఆదివారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరుగుతాయి. మకర సంక్రాంతితో పాటు ప్రతి మాసంలో వచ్చే రాశి ఆధారిత సంక్రాతి రోజుల్లో కూడా ప్రత్యేక పూజలు జరుగుతాయి. ఇక మాఘ మాసంలో, వ్య మాసంలో వచ్చే సాంబ దశమి పండుగలను ఇక్కడ అత్యంత వైభవంగా నిర్వహిస్తారు.

దర్శన ఫలం

దారు కోణార్క్ సూర్య దేవాలయంలో వెలసిన శ్రీ బిరంచి నారాయణ స్వామిని దర్శించి పూజించడం వల్ల దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు తొలగుతాయని, ఆయురారోగ్య ఐశ్వర్యాలు సిద్ధిస్తాయని విశ్వాసం.

ఎలా చేరుకోవాలి?దారు కోణార్క్ సూర్య దేవాలయం గంజాం జిల్లాలోని ప్రముఖ నగరమైన బెర్హంపూర్ నుంచి సుమారు 70

పిల్లలు నడక మొదలుపెట్టారా? - తల్లిదండ్రులుగా మీరు ఈ జాగ్రత్తలు తీసుకోవాలట!

నవమాసాలు మోసి బిడ్డకు జన్మ ఇచ్చిన తర్వాత ఆ తల్లి పడే ఆనందం అంతా ఇంతా కాదు. ఇక ఆ బిడ్డ బుడి బుడి అడుగులు వేస్తుంటే ఎంతగానో మురిసిపోతుంది. ప్రతి అడుగునూ మనసులో ముద్రించుకుంటుంది. అయితే సాధారణంగా పిల్లలు నాలుగు నుంచి పదిహేను నెలల లోపు.. నిలబడడం, కూర్చోవడం, నడవడం ఇలా ఒకదాని తర్వాత మరొకటి నేర్చుకుంటుంటారు. ఇక ఇలా నడిచే సమయంలో పిల్లలకు చిన్న చిన్న దెబ్బలు తగిలే అవకాశం కూడా ఉంది. కాబట్టి వారిని జాగ్రత్తగా కాపాడే బాధ్యత తల్లిదండ్రులదే అంటున్నారు నిపుణులు. ఈ క్రమంలోనే పిల్లలు నడక నేర్చుకునేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.పొడవు డ్రస్సులు వద్దు: పిల్లలు నడిచే సమయంలో పొడవు డ్రస్సులు వద్దంటున్నారు నిపుణులు. ఎందుకంటే ఈ డ్రస్సులు వేసుకున్నప్పుడు వాళ్ల కాళ్ల కింద పడి ఇబ్బందిగా ఉంటాయని, ఒక్కోసారి వాటిని తట్టుకొని కింద పడిపోయే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. అందుకే కనీసం నడిచే కాసేపైనా పొట్టి డ్రస్సులు వేయడం మంచిదని సూచిస్తున్నారు.

వాకర్‌తో కేర్‌ఫుల్‌గా: ఎప్పుడైతే పిల్లలు సొంతంగా నిలబడటం నేర్చుకుంటారో, వెంటనే వాళ్లకు వాకర్ ద్వారా సపోర్ట్ ఇవ్వాలంటున్నారు నిపుణులు. అంటే వాళ్లను వాకర్‌లో కూర్చోబెట్టాలని.. దాని వెనకాల తల్లిదండ్రులు స్తున్నారు నిపుణులు. ముఖ్యంగా బయటకు వెళ్లినప్పుడు షూస్ వేయడం మర్చిపోవ ద్దంటున్నారు. ఎందుకంటే నేలమీద నడిస్తే ఏవైనా గుచ్చుకోవడం, లేత పాదాలు కందిపోవడం లాంటివి జరిగే అవకాశం ఎక్కువని.. అలాగే నడిచేటప్పుడు ఒక్కసారి ముందుకు పడితే అరచేతులకు దెబ్బ తగిలే నిలబడి నెమ్మదిగా ముందుకు నెట్టాలం టున్నారు. ఎలాగో పిల్లలు వాకర్‌లో ఉంటారు, కాబట్టి బ్యాలెన్స్ కూడా ఆగుతుందని వివరిస్తు న్నారు. అయితే పిల్లలు త్వరగా నడక నేర్చుకో




వాలని చెప్పి గంటల కొద్దీ వాకర్‌లో ఉంచితే వారికి నడుంనొప్పి వచ్చే ప్రమాదమూ ఉందని హెచ్చరిస్తున్నారు. కాబట్టి రోజుకు కాసేపే వాకర్‌లో వేయడం మంచిదంటున్నారు. అలాగే వాకర్‌లో ఉంచినంతసేపు పక్కన ఎవరో ఒకరు తప్పనిసరిగా ఉండాలని.. లేదంటే మెట్లు, నేలపై నీళ్లు లాంటి ప్రదేశాల్లో పిల్లలు పడిపోయే అవకాశం ఉందంటున్నారు.

చేయూతనివ్వండి: పిల్లలు త్వరగా నడక నేర్చుకోవాలని చెప్పి కొందరు తల్లిదండ్రులు.. పిల్లలకు ఏ విధమైన సపోర్ట్ ఇవ్వకుండా నడిపించడానికి ప్రయత్నిస్తుంటారు. దీంతో పిల్లలు పడిపోవడమే కాకుండా దెబ్బలు తగిలే అవకాశాలు కూడా ఎక్కువే అంటున్నారు. అందుకే నడవడానికి ప్రయత్నించే మొదట్లో కొన్ని రోజుల వరకు పేరెంట్స్? చేతి వేళ్లను వారికి ఆధారంగా అందించమంటున్నారు. దీంతో వారిలో నడవాలనే ఆకాంక్ష బలపడుత ుందని.. ముందడుగు వేస్తారంటున్నారు.

సాక్సులు వేయాలి: నడిచేటప్పుడు పిల్లలకు తప్పనిసరిగా సాక్సులు వేయాలని సూచి స్తున్నారు నిపుణులు. ముఖ్యంగా బయటకు వెళ్లినప్పుడు షూస్ వేయడం మర్చిపోవ ద్దంటున్నారు. ఎందుకంటే నేలమీద నడిస్తే ఏవైనా గుచ్చుకోవడం, లేత పాదాలు కందిపోవడం లాంటివి జరిగే అవకాశం ఎక్కువని.. అలాగే నడిచేటప్పుడు ఒక్కసారి ముందుకు పడితే అరచేతులకు దెబ్బ తగిలే అవకాశం ఉంటుందంటున్నారు. కేవలం కాళ్లకు మాత్రమే కాకుండా వీలైతే చేతులకూ గ్లౌజులు వేయడం మరింత మంచిది అంటున్నారు నిపుణులు.

ఆ సమయంలో కూడా జాగ్రత్త ఉండాలి: ఇవి మాత్రమే కాకుండా పిల్లలు నడక నేర్చుకునే సమయంలో, ముఖ్యంగా రాత్రుళ్లు చాలా జాగ్రత్తగా వారిని కాపాడుకోవాలంటున్నారు నిపుణులు. ఎందుకంటే రాత్రి మెలకువ వచ్చినప్పుడు చిన్నారులు నడవడానికి ప్రయత్నం చేస్తారని, ఈ నేపథ్యంలో అదుపు తప్పి కింద పడే ప్రమాదం ఉందంటున్నారు. కాబట్టి, పిల్లల్ని పక్కనే పడుకోబెట్టి, మధ్యమధ్యలో వారిని ఓ కంట కనిపెడుతూ

ముఖంపై "నల్లటి మచ్చలు" ఉన్నాయా? ఇంట్లో లభించే పదార్థాలతో పోగొట్టుకోవచ్చట!



మహిళ జీవితంలో అత్యంత మధురమైన సమయం ప్రెగ్నెన్సీ. ఈ క్రమంలోనే పుట్టే బిడ్డ కోసం ఎంతగానో ఎదురుచూస్తుంటారు. ఇక గర్భం ధరించినప్పుడు మహిళ శరీరంలో ఎన్నో మార్పులు చోటుచేసుకుంటాయి. అందులో పిగ్మెంటేషన్ ఒకటి. బుగ్గలు, నుదురు పైన ఏర్పడే నల్లటి మచ్చల కారణంగా ఒక్కోసారి ముఖంలో కళ లోపిస్తుంది. దీంతో చాలా మంది ఆందోళన చెందుతుంటారు. అయితే ఇంట్లోనే సులభంగా లభించే కొన్ని పదార్థాలు ఉపయోగించి ఈ సమస్యను పరిష్కరించవచ్చంటున్నారు నిపుణులు.

పిగ్మెంటేషన్?: గర్భధారణ సమయంలో పిగ్మెంటేషన్? అనేది సహజం అని నిపుణులు చెబుతున్నారు. వైద్య పరిభాషలో దీనిని 'మెలస్మా' లేదా 'ప్రెగ్నెన్సీ మాస్క్' అని పిలుస్తారంటున్నారు. శరీరంలో ఈస్ట్రోజెన్, ప్రొజెస్టెరాన్ హార్మోన్ల స్థాయిలు విపరీతంగా పెరుగుతాయని.. ఈ హార్మోన్ల మార్పుల వల్ల చర్మానికి రంగును ఇచ్చే 'మెలనిన్' ఉత్పత్తి చేసే కణాలు అతిగా ప్రేరేపించబడతాయని.. దీనివల్ల చర్మంపై నల్లటి మచ్చలు ఏర్పడతాయంటున్నారు. ముఖ్యంగా బుగ్గలు, నుదురు, ముక్కు భాగాలపై ఏర్పడే నల్లటి మచ్చల వల్ల ముఖంలో సహజమైన కళ లోపిస్తుందంటున్నారు. ఈ క్రమంలో ఈ పదార్థాలు ఉపయోగపడతాయంటున్నారు.

కలబంద గుజ్జు: ముఖంపై ఉండే మచ్చలను తొలగించడంలో కలబంద ఎఫెక్టివ్?గా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే టేబుల్‌స్పూన్ చొప్పున తేనె, కలబంద గుజ్జు తీసుకొని అందులో రెండు టేబుల్‌స్పూన్ల బొప్పాయి గుజ్జు వేసి ప్యాక్‌లాగా తయారుచేసుకోవాలంటున్నారు. దీన్ని మచ్చలున్న చోట రాసి అరగంట పాటు ఆరనివ్వాలని, ఆపై కడిగేసుకోవాలంటున్నారు. ఇలా తరచూ చేయడం వల్ల సమస్య తగ్గడంతో పాటు అక్కడ చర్మంపై ఏర్పడిన మృతకణాలు సైతం తొలగిపోయి స్కిన్? గ్లో అవుతుందని వివరిస్తున్నారు.ఆరెంజ్? పీల్?: విటమిన్? సి పుష్కలంగా ఉండే కమలా ఆరోగ్యానికి మంచిదన్న సంగతి తెలిసిందే. కేవలం పండు మాత్రమే కాదు దాని తొక్కలు కూడా చర్మానికి మేలు చేస్తాయంటున్నారు. ఈ నేపథ్యంలోనే కొన్ని కమలా తొక్కలను ఎండబెట్టి పొడి చేసుకుని.. ఇందులో పచ్చి పాలను చేర్చి పేస్ట్‌లా తయారుచేసుకోవాలి. అనంతరం ఆ మిశ్రమాన్ని మచ్చలు ఉన్న చోట అప్లై చేసి.. ఇరవై నిమిషాల తర్వాత చల్లటి నీటితో కడిగేసుకుంటే మంచి ఫలితం ఉంటుందంటున్నారు.ఓట్స్?, టమాట, పెరుగు: ఈ మూడింటిని ఉపయోగించి కూడా ముఖంపై మచ్చలు తొలగించుకోవచ్చంటున్నారు. ఈ క్రమంలోనే రెండు టేబుల్‌స్పూన్ల ఓట్‌మీల్, అర టేబుల్‌స్పూన్ టమాట రసం, టేబుల్‌స్పూన్ పెరుగు తీసుకుని మిక్స్? చేసుకుని పేస్ట్‌లా తయారుచేసుకోవాలట. ఆ తర్వాత ఈ పేస్ట్?ను సమస్య ఉన్న చోట రాసుకొని ఇరవై నిమిషాల తర్వాత చల్లటి నీటితో కడిగేసుకుంటే ఫలితం ఉంటుందంటున్నారు.

ఎందుకంటే టమాటలోని సహజసిద్ధమైన బ్లీచింగ్ గుణాలు చర్మాన్ని శుభ్రపరుస్తాయని, ఓట్‌మీల్ ఎక్స్‌ఫోలియేటింగ్ ఏజెంట్‌గా పనిచేసి సమస్యను తగ్గిస్తుందంటున్నారు. ఇక పెరుగు ముఖాన్ని స్మూత్?గా మారుస్తుందని చెబుతున్నారు.ఈ లోషన్? కూడా తప్పనిసరి: సన్‌స్క్రీన్ లోషన్లు రాసుకోకపోవడం వల్ల కూడా ఈ సమస్య తలెత్తే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. కాబట్టి బయటికి వెళ్లేటప్పుడు ఎస్పీఎఫ్ 30 సన్‌స్క్రీన్ రాసుకోవడం, ముఖాన్ని స్కార్ఫ్‌తో కవర్ చేసుకోవడం మాత్రం మరవకూడదని సూచిస్తున్నారు.డైట్? కూడా ముఖ్యమే: పిగ్మెంటేషన్‌ని తగ్గించుకోవడానికి ఆహారం విషయంలో కూడా శ్రద్ధ వహించడం అవసరం అంటున్నారు నిపుణులు. ఇందులో భాగంగానే దానిమ్మ, బెర్రీస్, నట్స్ వంటి యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండే పదార్థాలతో పాటు కివీ, నిమ్మ, స్ట్రాబెర్రీ, కమలాఫలం, ద్రాక్ష వంటి విటమిన్-సి అధికంగా లభించే పండ్లను కూడా ఆహారంలో భాగం చేసుకుంటే చక్కటి ఫలితం ఉంటుందని చెబుతున్నారు. ఇవి కడుపులో పెరుగుతున్న బిడ్డ ఆరోగ్యానికీ మేలు చేస్తాయంటున్నారు.చివరగా, పైన చెప్పిన పదార్థాలు చర్మానికి మేలు చేసినా, అన్ని చర్మతత్వాల వారికి సరిపడకపోవచ్చని.. తద్వారా అలర్జీల బారిన పడే అవకాశం ఉండచ్చంటున్నారు. కాబట్టి వీటిని వాడే ముందు ప్యాచ్?టెస్ట్?తో పాటు వ్యక్తిగత వైద్య నిపుణులను సంప్రదించడం మంచిదని సూచిస్తున్నారు.

సతీదేవి కుడికాలి బొటనవేలు పడిన శక్తిపీఠం -500 ఏళ్ల తర్వాత ఎగిరిన ధ్వజ తాకంపావాగఢ్ మహాకాళి ఆలయ విశిష్టత ఇదే!



సతీదేవి శరీర భాగాలు పడిన పవిత్ర ప్రదేశాలు అష్టాదశ శక్తిపీఠాలుగా విరాజిల్లుతున్నాయి. సాక్షాత్తు శ్రీ ఆది పరాశక్తి శక్తి రూపాలే ఈ అష్టాదశ శక్తి పీఠాలని భక్తుల విశ్వాసం. ఆదిశంకరులు ఈ పద్దెనిమిది క్షేత్రాలనూ దర్శించి శ్రీచక్ర ప్రతిష్ఠ చేశారని చెబుతారు. అందుకే ఈ క్షేత్రాలు అత్యంత విశిష్ఠమైనవని చెబుతారు. వీటిల్లో సతీదేవి కుడికాలి బొటనవేలు పడిన పవిత్ర శక్తిపీఠం గురించిన విశేషాలు చూద్దాం.

పావాగఢ్ మహాకాళి

గుజరాత్‌లోనిమాత ఆలయం పంచమహల్ జిల్లాలో ఉన్న పావాగఢ్ పర్వతంపై కొలువై ఉన్న మహాకాళి అమ్మవారు వెలసిన క్షేత్రం భారతదేశంలోని ప్రముఖ శక్తి పీఠాలలో ఒకటిగా విరాజిల్లుతోంది. సుమారు 11వ శతాబ్దానికి చెందిన ఈ పురాతన ఆలయం చంపానీర్, పావాగఢ్ పురావస్తు ప్రాంతం యొక్క శిఖరాగ్రాన ఉంది. సతీదేవి కుడికాలి బొటనవేలు ఈ క్షేత్రంలో పడిందని, అందుకే ఈ స్థలం దివ్య శక్తికి కేంద్రంగా మారిందని పురాణాలు చెబుతున్నాయి. ఈ కారణంగానే లక్షలాది మంది భక్తులు దేవి నవరాత్రులలో మాత్రమే కాకుండా ఏడాది పొడవునా అమ్మవారి దర్శనం కోసం ఇక్కడికి వస్తుంటారు. ఈ పవిత్ర క్షేత్రం గురించి మరిన్ని విశేషాలు తెలుసుకుందాం.

500 ఏళ్ల తర్వాత ఎగిరిన ధ్వజ పతాకం

15వ శతాబ్దంలో సుల్తాన్ మహమూద్ బెగ్డా ఈ ప్రాంతాన్ని ముట్టడించి, పావాగఢ్ కోటతో పాటు ఆలయ శిఖరాన్ని ధ్వంసం చేశాడు. ఆపై గర్భగుడిపై 'సదన్‌షా పీర్' దర్గాను నిర్మించాడు. ధ్వంసమైన ఆలయ శిఖరం, దర్గా వివాదం కారణంగా ఈ ఆలయంపై దాదాపు 500 సంవత్సరాల పాటు జెండా ధ్వజ పతాకం ఎగరలేదు. ఎందుకంటే శాస్త్రాల ప్రకారం శిఖరం సంపూర్ణంగా ఉంటేనే ధ్వజారోహణ చేస్తారు. అనంతర కాలంలో ఇరు వర్గాల మధ్య సయోధ్య కుదరడంతో, దర్గాను పక్కకు జరిపి ఆలయ శిఖరాన్ని పునర్నిర్మించారు. జూన్ 2022లో దేశ ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా పునర్నిర్మించిన ఆలయంపై 500 ఏళ్ల తర్వాత మళ్లీ పవిత్ర ధ్వజ పతాకాన్ని ఎగురవేశారు.

జగజ్జనని- కల్యాణ స్వరూపిణి

పావాగఢ్ మహాకాళి అమ్మవారిని ఆదిశక్తిగా, జగజ్జనునిగా, కల్యాణ స్వరూపిణిగా కొలుస్తారు. ఆలయ స్థల పురాణం ప్రకారం, విశ్వామిత్ర మహర్షి ఈ పర్వతంపై తపస్సు చేశారని, అమ్మవారి ఆరాధనతో ఈ స్థలం సిద్ధ పీఠం గా మారిందని ప్రతీతి. మహాకాళి అమ్మవారి ఈ ధామం గుజరాత్‌లోని మూడు ప్రముఖ శక్తిపీఠాలైన అంబాజీ, బహుచరాజీ పావాగఢ్‌లలో అత్యంత ప్రధానమైనదిగా పరిగణించబడుతుంది.

యంత్రానికి పూజ

మహాశక్తి పీఠంగా విరాజిల్లుతున్న ఈ క్షేత్రంలో గర్భాలయంలో మూడు అమ్మవారి స్వరూపాలు దర్శనమిస్తాయి. ప్రధాన పీఠంపై కుడివైపున కాళికా దేవి, ఎడమవైపు బహుచరా మాత వెలసి ఉండగా, మధ్యలో మహాకాళి మాత దర్శనమిస్తుంది. ఇక్కడ విశేషమేమిటంటే గర్భాలయంలో అమ్మవారి విగ్రహానికి బదులుగా కాళీ యంత్రాన్ని పూజించడం విశేషం.

పూజోత్సవాలు

శరన్నవరాత్రులలో అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు, పూజలు జరుగుతాయి. ఇక ప్రతి మంగళవారం, శుక్రవారం అమ్మవారి సమక్షంలో రాహుకాల పూజలు, కుంకుమ పూజలు విశేషంగా జరుగుతాయి. ఈ క్షేత్రంలో రాహుకాల పూజలు నిర్వహిస్తే సమస్త గ్రహ దోషాలు తొలగుతాయని విశ్వాసం.

దర్శన ఫలం

పావాగఢ్ మహాకాళి అమ్మవారిని దర్శించి భక్తిశ్రద్ధలతో పూజిస్తే అమ్మవారి కృప వల్ల భయం, ఆటంకాలు, శత్రు పీడలు మరియు ప్రతికూల శక్తులు నశించి, సాధకుడికి ధైర్యం, శక్తిఆధ్యాత్మిక పురోగతి లభిస్తాయని విశ్వాసం.

ఎలా చేరుకోవాలి

గుజరాత్ రాష్ట్రంలోని అన్ని ప్రధాన జిల్లా కేంద్రాల నుంచి పావాగఢ్ మహాకాళి క్షేత్రానికి చేరుకోవడానికి మెరుగైన రవాణా సౌకర్యాలున్నాయి. సముద్ర మట్టానికి సుమారు 800 మీటర్ల ఎత్తులో వెలసి ఉన్న ఈ ఆలయానికి చేరుకోవడానికి మెట్ల సదుపాయంతో పాటు రోప్‌వే కూడా అందుబాటులో ఉంది.

జై మా పావాగఢ్ మహాకాళి!

ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

భారత్ బౌలర్లపై విరుచుకుపడ్డ కివీస్..

3-2తో సిరీస్ ముగింపు

ఐదో టీ20లో భారత్‌పై కివీస్ ఘన విజయం

ఏడు వికెట్ల తేడాతో న్యూజిలాండ్ గెలుపు

భారత్ స్కోరు 191/8

ఇషాన్ కిషన్ 61 పరుగులు, శ్రేయస్ అయ్యర్ అర్ధశతకం

రెండు ఓవర్లు మిగిలుండగానే విజయాన్ని అందుకున్న కివీస్

సీఫర్ట్ 93, ఫిలిప్స్ 65 నాటౌట్



ఐదో టీ20లోనూ భారత జట్టుకు నిరాశే ఎదురైంది. సొంతగడ్డపై న్యూజిలాండ్ అద్భుతంగా ఆడి భారత్‌పై 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 191 పరుగులు చేసింది. లక్ష్యాన్ని న్యూజిలాండ్ 18 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. తొలి మూడు మ్యాచ్ ల్లో వరుస విజయాలతో భారత్ ఇప్పటికే సిరీస్‌ను కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. అయితే, చివరి రెండు మ్యాచ్ ల్లోనూ న్యూజిలాండ్ నెగ్గడంతో, ఈ ఐదు మ్యాచ్ ల సిరీస్ లో భారత్ ఆధిక్యం 3-2కి తగ్గింది. నేటి మ్యాచ్ విషయానికొస్తే.. భారత్ ఇన్నింగ్స్‌లో ఇషాన్ కిషన్ (61; 32 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సర్లు), శ్రేయస్ అయ్యర్ (50; 23 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లు) మెరుపు అర్ధశతకాలతో ఆకట్టుకున్నారు. నమన్ ధీర్ 33, నితీశ్ కుమార్ రెడ్డి 22 పరుగులు చేశారు. అయితే మిగతా బ్యాటర్లు పెద్దగా రాణించలేకపోయారు. న్యూజిలాండ్ బౌలర్లలో ఆడమ్ మిల్నే 19 పరుగులిచ్చి నాలుగు వికెట్లు పడగొట్టాడు. నాథన్ స్మిత్, బ్లెయిర్ టిక్నర్ రెండేసి వికెట్లు తీశారు.192 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కివీస్‌కు టిమ్ సీఫర్ట్ (93; 50 బంతుల్లో 11 ఫోర్లు, 5 సిక్సర్లు), గ్లెన్ ఫిలిప్స్ (65 నాటౌట్; 38 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సర్లు) అద్భుత విజయాన్ని అందించారు. డారిల్ మిచెల్ 29 పరుగులతో రాణించాడు. సీఫర్ట్-మిచెల్ జోడీ రెండో వికెట్‌కు 73 పరుగులు జోడించగా, సీఫర్ట్-ఫిలిప్స్ జంట మూడో వికెట్‌కు 86 పరుగులు చేసింది. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, నితీశ్ కుమార్ రెడ్డి ఒక్కో వికెట్ తీశారు. సీఫర్ట్-ఫిలిప్స్ ధాటికి భారత బౌలర్లు భారీగా పరుగులు సమర్పించుకున్నారు. మరో రెండు ఓవర్లు మిగిలుండగానే కివీస్ లక్ష్యాన్ని అందుకుంది.

మేం ఇంకా మెరుగ్గా ఉండాల్సింది..
న్యూజిలాండ్‌తో ఓటమిపై శ్రేయస్



బ్యాటింగ్‌లో కోల్పోయిన ఊపు, బౌలింగ్, ఫీల్డింగ్‌లో పేలవ ప్రదర్శనే న్యూజిలాండ్‌తో ఐదో టీ20లో ఓటమికి కారణమని భారత టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ అభిప్రాయపడ్డాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఇషాన్ కిషన్‌తో కలిసి మంచి భాగస్వామ్యం నెలకొల్పినా.. వరుస ఓవర్లలో వికెట్లు కోల్పోవడంతో ఆశించిన స్కోరు సాధించలేకపోయామని చెప్పాడు. బౌలింగ్, ఫీల్డింగ్‌లోనూ మరింత మెరుగైన ప్రదర్శన కనబర్చాల్సిందని అంగీకరించాడు.ఆదివారం సెడ్డన్ పార్క్‌లో జరిగిన ఐదో టీ20లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 191/8 పరుగులు చేసింది. ఇషాన్ కిషన్ (61), శ్రేయస్ అయ్యర్ (50) అర్ధశతకాలతో రాణించారు. అయితే వీరిద్దరూ 11, 12వ ఓవర్లలో వరుసగా ఔటవడంతో భారత్ ఇన్నింగ్స్ జోరు తగ్గింది. కొత్తగా క్రీజులోకి వచ్చిన బ్యాటర్లపై ఒత్తిడి పెరిగిందని శ్రేయస్ తెలిపాడు.

పిచ్‌పై బంతి స్వింగ్ అవడంతో పాటు కొన్ని సందర్భాల్లో వేగంగా దూసుకొచ్చిందని చెప్పాడు. హార్డ్ లెంగ్త్ బంతులను ఎదుర్కోవడం సవాలుగా మారిందన్నాడు. తాను, తిలక్ వర్మ కూడా ఇలాంటి బంతులకే ఔటయ్యామని గుర్తుచేశాడు. ఈ పరిస్థితుల్లో 194 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించడం ఫర్వాలేదనిపించిందని పేర్కొన్నాడు.అయితే బౌలింగ్, ఫీల్డింగ్‌లో జట్టు ఇంకా మెరుగ్గా ఆడాల్సిందని శ్రేయస్ అన్నాడు. ఛేజింగ్‌లో టిమ్ సీఫర్ట్ 13 పరుగుల వద్ద ఉన్నప్పుడే నమన్ ధీర్ క్యాచ్ వదిలేశాడు. తర్వాత గ్లెన్ ఫిలిప్స్ ఇచ్చిన కఠినమైన క్యాచ్‌ను సంజు శాంసన్ అందుకోలేకపోయాడు. ఈ తప్పిదాలపై జట్టు సమీక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నాడు. ముఖ్యంగా ఫీల్డింగ్‌పై దృష్టి పెట్టాలని సూచించాడు.

న్యూజిలాండ్ పర్యటన మంచి అనుభవాన్నిచ్చిందని శ్రేయస్ చెప్పాడు. తొలి మూడు మ్యాచ్‌ల్లోనే భారత్ సిరీస్‌ను కైవసం చేసుకోవడంతో చివరి రెండు మ్యాచ్‌ల్లో ప్రయోగాలు చేసేందుకు అవకాశం లభించిందన్నాడు. ఐదో మ్యాచ్‌లో తమను తాము పరీక్షించుకునే మంచి అవకాశం వచ్చినా.. దాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయామని అంగీకరించాడు.

హుస్సాముద్దీన్‌కు రజతం



న్యూఢిల్లీ: తెలంగాణ బాక్సర్ మహ్మద్ హుస్సాముద్దీన్ ఇంటర్నేషనల్ టామర్ బాక్సింగ్ టోర్నీలో రజత పతకం సాధించాడు. ఫిన్లాండ్‌లోని టాంపెరెలో ఆదివారం జరిగిన ఈ పోటీల్లో హుస్సాముద్దీన్ 60 కిలోల కేటగిరి ఫైనల్లో ప్రత్యర్థి చేతిలో ఓటమిపాలై రజతంతో సరిపెట్టుకున్నాడు. ఇక, ఈ టోర్నీలో భారత బాక్సర్లు మొత్తంగా నాలుగు స్వర్ణాలు, రెండు రజతాలు, ఎనిమిది కాంస్యాలు గెలిచారు.

భయమా.. అది నా డిక్షనరీలోనే లేదు: గంభీర్

న్యూజిలాండ్‌తో జరిగిన ఐదు టీ20ల సిరీస్‌ను భారత్ కైవసం చేసుకోవడంపై ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ స్పందించాడు. చివరి రెండు మ్యాచ్‌లు ఓడిపోయినప్పటికీ.. టీమిండియా ప్రదర్శన సంతృప్తినిచ్చిందని వెల్లడించాడు. న్యూజిలాండ్ గడ్డపై సిరీస్ సాధించడంలో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కీలక పాత్ర పోషించాడని ప్రశంసించాడు. బౌలింగ్ విభాగంలో అనుభవజ్ఞులైన ప్లేయర్లు లేకపోయినా జట్టును అద్భుతంగా నడిపించాడని కొనియాడాడు. 'శ్రేయస్ బాధ్యతలు చేపట్టినప్పుడు అతడికి ఎంతో విజయవంతమైన జట్టు అందింది. టీ20 ప్రపంచకప్ గెలిచిన జట్టుతో పాటు రెండేళ్లుగా టీ20 సిరీస్ ఓడిపోని టీమ్ అతడి చేతుల్లోకి వచ్చింది. ప్రపంచకప్ తర్వాత మాకు ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి. ముఖ్యంగా ఇంగ్లండ్, న్యూజిలాండ్ వంటి దేశాల్లో పర్యటించినప్పుడు అనుభవం లేని ఆటగాళ్లతో ఆడటం అంత సులభం కాదు. ఆటగాళ్లందరూ గొప్పగా కృషి చేశారు. ప్రాక్టీస్‌కు ఒక్క రోజే సమయం దొరికింది. అందులోనూ కివీస్ తమ సొంతగడ్డపై ఎప్పుడూ ప్రమాదకారే. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో సిరీస్ గెలవడం ఆషామాషీ కాదు. ఒక కెప్టెన్ ప్రదర్శన అతడి బౌలర్లు, బ్యాటర్ల ఆటతీరుపై ఆధారపడి ఉంటుంది. ఈ పరిస్థితుల్లో శ్రేయస్ అద్భుతంగా రాణించాడు' అని గంభీర్ వివరించాడు.

కోచ్‌గా ఈ ప్రయాణంలో సవాళ్లను ఎదుర్కున్నారా? అనే ప్రశ్నకు గంభీర్ స్పందించాడు. 'నేను ఏ విషయంలోనూ భయపడలేదు. భయం అనేది నా డిక్షనరీలోనే లేదు. మేమంతా ప్రొఫెషనల్స్, శాయశక్తులా ప్రయత్నించడం, దేశానికి విజయాలు అందించడమే మా పని. ఆకర్షణీయమైన నిర్ణయాల కంటే జట్టుకు అవసరమయ్యే వాటికే ప్రాధాన్యమిస్తా. ఆటగాళ్లలో అభద్రతాభావం రాకూడదంటే వారికి మరిన్ని అవకాశాలివ్వాలి. నేను అది మాత్రమే అనుసరిస్తున్నా. రెండున్నరేళ్లుగా మేము ఒకే తరహా క్రికెట్ ఆడుతున్నాం. హైరిస్క్.. హైరివార్డ్ అనేదే మా విధానం. ఈ క్రమంలో కొన్నిసార్లు మ్యాచ్‌లు ఓడిపోవచ్చు. భవిష్యత్తులోనూ భారీ తేడాతో ఓటములు ఎదురుకావచ్చు. కానీ మా ఆలోచనా విధానం, ఆటతీరు మాత్రం మారవు. గత రెండేళ్లలో మాకు విజయాలు అందించింది ఈ విధానమే' అని గంభీర్ స్పష్టం చేశాడు.



పీవీ సింధు రికార్డు.. హైలో ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్ కైవసం!




(ఆదివారం) జరిగిన హైలో ఓపెన్ సూపర్ 500 టోర్నమెంట్ తుదిపోరులో పీవీ సింధు డెన్మార్క్‌కు చెందిన లైన్ జార్స్‌ఫెల్డ్‌ను 21-12, 21-14 తేడాతో చిత్తుగా ఓడించి టైటిల్ కైవసం చేసుకుంది. ఈ టోర్నీ చరిత్రలో పురుషుల సింగిల్స్, డబుల్స్, మిక్స్డ్ డబుల్స్ విభాగాల్లో భారత ఆటగాళ్లు గతంలో టైటిల్స్ సాధించినప్పటికీ.. మహిళల సింగిల్స్ ట్రోఫీని గెలుచుకోవడం మాత్రం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ ఘనత సాధించిన తొలి భారతీయ మహిళా షట్లర్‌గా సింధు అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకుంది. ఫైనల్ పోరులో సింధు తనదైన దూకుడును ప్రదర్శించింది.అద్భుతమైన స్మాష్‌లతో ప్రత్యర్థికి ఎక్కడా అవకాశం ఇవ్వకుండా సింధు విజయం సాధించింది. గత కొంతకాలంగా ఫామ్ కోసం శ్రమిస్తున్న ఈ తెలుగు తేజం, ఈ విజయంతో మళ్లీ తన సత్తా ఏంటో నిరూపించుకుంది. సింధు సాధించిన ఈ చరిత్రాత్మక విజయంపై ప్రశంసల జల్లు కురుస్తున్నాయి. దేశానికి మరోసారి వన్నె తెచ్చిన సింధు భవిష్యత్తు టోర్నీల్లోనూ ఇదే జోరు కొనసాగించాలని అభిమానులు కోరుకుంటున్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

రామ్ చరణ్, సుకుమార్ కాంబినేషన్‌లో 'ఆర్‌సీ17' ప్రారంభం

పూజా కార్యక్రమం.. స్పెషల్ అట్రాక్షన్‌గా మెగాస్టార్ చిరంజీవి





మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, స్టార్ డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న కొత్త చిత్రం అధికారికంగా ప్రారంభమైంది. 'ఆర్‌సీ17' అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా పూజా కార్యక్రమాన్ని నేడు హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరై, ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ కొట్టి చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

బ్లాక్‌బస్టర్ హిట్ 'రంగస్థలం' తర్వాత రామ్ చరణ్, సుకుమార్ కలిసి పనిచేస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, టీ-సిరీస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఈ లాంచింగ్ ఈవెంట్‌కు పలువురు సినీ ప్రముఖులు హాజరయ్యారు.

త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించనున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. హీరోయిన్, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో అధికారికంగా ప్రకటిస్తామని నిర్మాతలు తెలిపారు. 'రంగస్థలం' వంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత ఈ కాంబోలో వస్తున్న సినిమా కావడంతో అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది.



హింసకు సినిమాలే కారణం కాదన్న ఆర్జీవీ

సినిమాల్లో హింసాత్మక సన్నివేశాలు యువతపై ప్రభావం చూపుతున్నాయన్న చర్చపై దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ స్పందించాడు. సినిమాల్లో హింసను చూపించడం వల్ల సమాజంలో నేరాలు పెరుగుతున్నాయని విమర్శించడం సరికాదన్నాడు. సినిమాలపై వస్తున్న విమర్శలు సరైన దిశలో లేవని అభిప్రాయపడ్డాడు. ఈ మేరకు ఆదివారం తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశాడు. "కిడ్నాప్‌లు పెరుగుతున్నాయని రామాయణాన్ని నిందించడం ఎంత తప్పో.. హింస పెరుగుతోందని సినిమాలను నిందించడం కూడా అంతే తప్పు" అని వ్యాఖ్యానించాడు.

అనంతపురం జిల్లా రాప్తాడులోని ఓ పాఠశాలలో నిన్న జరిగిన రంపం దాడి నేపథ్యంలో ఈ చర్చ మొదలైంది. 21 ఏళ్ల యువకుడు పదో తరగతి గదిలోకి వెళ్లి 15 ఏళ్ల బాలికపై ఎలక్ట్రిక్ రంపంతో దాడి చేసిన విషయం తెలిసిందే. ఆమెను కాపాడేందుకు ప్రయత్నించిన మరో విద్యార్థినికి కూడా గాయాలయ్యాయి. ప్రాథమిక పోలీసు విచారణ ప్రకారం.. నిందితుడు బాధితురాలికి బంధువని, ఆమెను కొంతకాలంగా వేధిస్తున్నాడని తెలుస్తోంది. బాధితురాలు బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం.

ఈ ఘటన తర్వాత సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రణ్‌బీర్ కపూర్ నటించిన 'యానిమల్' సినిమాలోని ఓ సన్నివేశంపై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తాయి. ఆ సన్నివేశంలో రణ్‌బీర్ ఏకే-47 తుపాకీతో పాఠశాల తరగతి గదిలోకి ప్రవేశిస్తాడు. సినిమాలు హింసను గొప్పగా చూపిస్తున్నాయని పలువురు విమర్శకులు అభిప్రాయపడుతున్నారు. హింసను పురుషత్వానికి చిహ్నంగా చూపించడం యువతపై ప్రతికూల ప్రభావం చూపుతుందని మరికొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సందీప్ రెడ్డి వంగాకు ఆర్జీవీ గతంలోనూ మద్దతుగా నిలిచాడు. ఆయన సినిమాల శైలిని పలుమార్లు ప్రశంసించాడు.

53 ఏళ్లు.. ఐశ్వర్యారాయ్ డైట్ సీక్రెట్ ఇదే..!



బాలీవుడ్ నటి ఐశ్వర్యారాయ్ అందం, ఫిట్‌నెస్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్న ఆమెకు నేటితో 53 ఏళ్లు. తన ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఆమె ఖరీదైన డైట్ ప్లాన్లు అనుసరిస్తారని చాలామంది అనుకుంటారు. కానీ ఆమె ఆహారపు అలవాట్లు మాత్రం చాలా సాదాసీదాగా ఉంటాయి. ఎన్డీటీవీ కథనం ప్రకారం, ఇంట్లో వండిన సాధారణ భోజనానికే ప్రాధాన్యం ఇస్తుంది. పప్పు, అన్నం, కూరగాయల వంటి సంప్రదాయ ఆహారమే తనకు ఇష్టమని గతంలో పలు ఇంటర్వ్యూల్లో వెల్లడించింది.

ఐశ్వర్య ఉదయం నిద్రలేవగానే గోరువెచ్చని నీటిలో నిమ్మరసం, తేనె కలుపుకొని తాగుతుంది. అల్పాహారాన్ని మాత్రం స్కిప్ చేయదు. బ్రౌన్ బ్రెడ్ టోస్ట్, ఓట్స్ వంటి పీచు పదార్థాలు, ప్రొటీన్లు ఉండే ఆహారాన్ని తీసుకుంటుందట.


లంచ్‌లో పప్పు, చపాతీ, ఉడికించిన కూరగాయలకు ప్రాధాన్యం ఇస్తుంది. అన్నం, పప్పు, కూరలతో కూడిన సాధారణ భారతీయ భోజనం తనకు ఎంతో ఇష్టమని ఆమె గతంలో పేర్కొంది. ప్రత్యేకమైన ఆహార నియమాల కంటే సమతుల్యమైన ఇంటి భోజనానికే ప్రాధాన్యం ఇస్తుంది.

రాత్రిపూట తక్కువ పరిమాణంలో ఆహారం తీసుకుంటుంది. బ్రౌన్ రైస్, గ్రిల్డ్ ఫిష్, ఉడికించిన కూరగాయలు వంటి పదార్థాలు ఆమె డిన్నర్‌లో ఉంటాయని సమాచారం. రోజంతా ఒకేసారి ఎక్కువగా తినకుండా చిన్న చిన్న పరిమాణాల్లో ఆహారం తీసుకోవడం కూడా ఆమెకు అలవాటు.

నూనెలో వేయించిన పదార్థాలు, జంక్ ఫుడ్ కంటే తాజా పండ్లు, కూరగాయలు, నట్స్‌కు ప్రాధాన్యం ఇస్తుంది. రోజంతా తగినంత నీరు తాగుతూ శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకుంటుంది. యోగా, నడక వంటి శారీరక వ్యాయామాలకూ ప్రాధాన్యం ఇస్తుంది.




వైట్ గ్లామర్‌తో మాళవిక మోహనన్..



సౌత్ ఇండియన్ గ్లామరస్ బ్యూటీ మాళవిక మోహనన్ తన అందచందాలతో, స్టైలిష్ ఫొటోషూట్‌లతో ఎప్పుడూ సోషల్ మీడియాలో సెన్సేషన్ సృష్టిస్తుంటారు. తాజాగా ఆమె వైట్ కలర్ అనార్కలీ డ్రెస్‌లో షేర్ చేసిన ఎలిగెంట్ పిక్స్ ప్రస్తుతం ఇంటర్నెట్‌ను ఊపేస్తున్నాయి. రాయల్ లుక్, క్లాసిక్ వింటేజ్ వైబ్‌తో కూడిన ఈ ఫొటోల్లో మాళవికను చూసిన నెటిజన్లు చూపు తిప్పుకోలేకపోతున్నారు. ఎంతో ప్రశాంతంగా, పొయెటిక్‌గా ఉన్న ఆ సినిమాటిక్ ఫొటోషూట్ విశేషాలు ఇప్పుడు చూద్దాం.రాయల్ వైట్ అనార్కలీలో దేవకన్యలా: తాజా ఫొటోషూట్‌లో మాళవిక మోహనన్ ఒక కలర్‌ఫుల్ అండ్ రాయల్ వైట్ అనార్కలీ అవుట్‌ఫిట్‌లో మెరిసిపోయారు. పారదర్శకమైన షీర్ దుపట్టా, బాడీస్‌పై నాజూకైన పూల ఎంబ్రాయిడరీ మరియు సీక్విన్ వర్క్‌తో ఈ డ్రెస్ ఎంతో ఆకర్షణీయంగా ఉంది. ఇక దీనికి తోడు ఆమె ధరించిన పెద్ద వెండి జుంకాలు, చేతికి ఉన్న సింపుల్ రింగ్స్ ఆమె సాంప్రదాయక అందానికి మరిన్ని మెరుగులు దిద్దాయి. సినిమాటిక్ లొకేషన్.. స్మోకీ ఐస్ మేకప్: పుస్తకాల షెల్ఫ్‌లు, వెచ్చని దీపాల కాంతి ఉన్న ఒక ఇండోర్ లొకేషన్‌లో ఈ ఫొటోలను షూట్ చేశారు. స్మోకీ ఐస్, నేచురల్ మేకప్, లూజ్ హెయిర్‌తో మాళవిక ఇచ్చిన రాయల్ ఫోజులు ఏదో ఒక సినిమాలోని సీన్‌ను తలపిస్తున్నాయి. ప్రశాంతమైన వాతావరణంలో క్లోజప్ క్లిక్స్ నుండి లగ్జరీ సీటింగ్ పిక్స్ వరకు ప్రతీ ఫ్రేమ్‌లోనూ మాళవిక తనదైన రాయల్ ఎక్స్‌ప్రెషన్లతో ఆకట్టుకున్నారు.'ది రాజా సాబ్'తో టాలీవుడ్ ఎంట్రీ: మాళవిక మోహనన్ సినీ ప్రయాణం విషయానికి వస్తే, గతంలో ఆమె రెబల్ స్టార్ ప్రభాస్ సరసన 'ది రాజా సాబ్' చిత్రంలో నటించిన సంగతి తెలిసిందే. మారుతి దర్శకత్వంలో వచ్చిన ఈ హారర్-కామెడీ ఎంటర్‌టైనర్ చిత్రం జనవరి 9, 2026న విడుదలై ప్రేక్షకులను బాగా అలరించింది. ఇక ఈ సినిమాతో మాళవిక తెలుగు ప్రేక్షకుల మనసుల్లో ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారు. కోలీవుడ్‌లో వరుస హిట్లు, కొత్త ప్రాజెక్టులు: టాలీవుడ్‌లోనే కాకుండా తమిళంలోనూ మాళవిక వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ఇటీవల కార్తీ హీరోగా పి.ఎస్. మిత్రన్ దర్శకత్వంలో వచ్చిన యాక్షన్ స్పై థ్రిల్లర్ 'సర్దార్ 2' లో తన నటనతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం ప్రముఖ దర్శకుడు త్యాగరాజన్ కుమారరాజా కాంబినేషన్‌లో విజయ్ సేతుపతితో కలిసి ఒక పవర్‌ఫుల్ క్రైమ్ డ్రామా ప్రాజెక్ట్‌లో నటిస్తున్నారు. ఇక మొత్తానికి చూస్తే, వెండితెరపై పవర్‌ఫుల్ క్యారెక్టర్లతో అలరిస్తూనే, సోషల్ మీడియాలో తనదైన క్లాసిక్ అండ్ ఎలిగెంట్ ఫ్యాషన్ సెన్స్‌తో మాళవిక మోహనన్ మెస్మరైజ్ చేస్తున్నారు. తాజాగా ఆమె షేర్ చేసిన ఈ 'వైట్ గ్లామర్' ఫొటోలు ప్రస్తుతం ఫ్యాన్స్‌ను విపరీతంగా ఆకట్టుకుంటూ నెట్టింట తెగ హల్ చల్ చేస్తున్నాయి.

'ఇరుముడి' మేకర్స్‌కు తెలంగాణ ప్రభుత్వం నోటీసులు



మాస్ మహారాజా రవితేజ హీరోగా ఇటీవల విడుదలై విజయం సాధించిన 'ఇరుముడి' చిత్రం కొత్త వివాదంలో చిక్కుకుంది. ఈ సినిమాలో నటించిన బాలనటి విషయంలో బాలకార్మిక చట్టంలోని నిబంధనలను పాటించలేదనే ఆరోపణలపై చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్‌కు తెలంగాణ కార్మిక శాఖ నోటీసులు జారీ చేసింది.జై లోక్‌సత్తా సోషల్ జస్టిస్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు చొల్లేటి మహేశ్ బాబు చేసిన ఫిర్యాదు ఆధారంగా అధికారులు ఈ చర్యలు చేపట్టారు. శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఈ ఆగస్టులో విడుదలై మంచి విజయం సాధించింది. ఇందులో రవితేజ కూతురు మణెమ్మ పాత్రలో బేబీ నక్షత్ర నటించి ప్రేక్షకులను మెప్పించింది. అయితే, చైల్డ్ ఆర్టిస్ట్‌గా ఆమెను తీసుకోవడంలో చట్టపరమైన నిబంధనలు ఉల్లంఘించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ జారీ చేసిన నోటీసులో పలు కీలక అంశాలపై వివరణ కోరారు. బాలికతో నటింపజేయడానికి జిల్లా మేజిస్ట్రేట్ నుంచి ముందస్తు అనుమతి తీసుకున్నారా? తల్లిదండ్రుల నుంచి సమ్మతి పత్రం ఉందా? బాలికకు చెల్లించిన పారితోషికంలో 20 శాతం ఆమె పేరు మీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారా? షూటింగ్ పని గంటలు, ఆమె చదువుకు ఆటంకం కలగకుండా తీసుకున్న చర్యలు ఏమిటి? వంటి వివరాలను సమర్పించాలని కోరారు.ఈ అంశాలపై పూర్తి ఆధారాలతో నవంబర్ 4వ తేదీ ఉదయం 11 గంటలకు ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని అంజయ్య కార్మిక సంక్షేమ భవన్‌లో విచారణకు హాజరు కావాలని నిర్మాతలను ఆదేశించారు. స్వయంగా లేదా అధీకృత ప్రతినిధి ద్వారా హాజరై వివరణ ఇవ్వాలని సూచించారు. ఈ నోటీసులపై మైత్రీ మూవీ మేకర్స్ ఇంకా అధికారికంగా స్పందించలేదు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613